రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## సిఐటియు నాయకులు, కార్మికులతో జిల్లా విద్యాధికారి జాయింట్ సమావేశం

-మధ్యాహ్నభోజనపథకం కార్మికులయూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న

**ఇబ్రహీంపట్నం, మార్చి 19, ప్రభాతవార్త:**

మధ్యాహ్నభోజనకార్మికులకు పెండింగ్‌లోనివేతనాలు,బిల్లులు వెంటనే విడుదలచేయాలని ప్రభుత్వాన్ని మధ్యాహ్నభోజనపథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న డిమాండ్‌చేశారు. ఈమేరకు జిల్లాకలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించడంతో కలెక్టర్ స్పందించి మధ్యాహ్నభోజనకార్మికులు,సిఐటియు నాయకులతో జిల్లావిద్యాధికారికి జాయింట్‌సమావేశం ఏర్పాటుచేయాలని ఆదేశించారు.దీంతో బుధవారం జిల్లా సమీకృతకార్యాలయంలోని విద్యాశాఖకార్యాలయంలో జాయింట్‌సమావేశం ఏర్పాటుచేశారు. ఈమేరకు మధ్యాహ్నభోజనకార్మికులు తమసమస్యలను జిల్లావిద్యాధికారి సుశీందర్‌రావుకు విన్నవించారు. తనపరిధిలో ఉన్నసమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలుతీసుకుంటామని డిఇఒ హామీ ఇచ్చినట్లు మధ్యాహ్నభోజనపథకం కార్మికులు,సిఐటియునాయకులు మీడియాకు తెలిపారు.

## బెల్ట్ షాపుల బెండు తీసేదెన్నడు..?

**నందిగామ, మార్చి 19, ప్రభాతవార్త:**

గ్రామాల్లో మద్యం ఏరులైపారుతున్నా సంబంధిత ఎక్సైజ్‌శాఖ అధికారులు మామూళ్లమాదనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు బాహాటంగా ఆరోపిస్తున్నారు. నందిగామమండలంలోని కన్హాగ్రామపంచాయతీ మినహా అన్నిగ్రామపంచాయతీలో బెల్టుషాపుల్లో మద్యంవిక్రయాలు మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో తెల్లారిందేమొదలు అర్ధ రాత్రివరకు మద్యంవిక్రయాలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లోని బెల్టుషాపుల యజమానులు వైన్స్‌యజమానులతో మాట్లాడుకొని, వారితోకుమ్మక్కై ఎమ్మార్పీధరకంటే ఒక్కోమద్యంసీసాపై ఎక్కువధరలకు మద్యంప్రియుల నుండి వసూలుచేసి సొమ్ముచేసుకుంటున్నారు. రోజంతా కాయకష్టంచేసి సంపాదించిన కూలీడబ్బులు మద్యంకోసం ఖర్చుచేస్తున్నారు. విచ్చలవిడిగా మద్యంవిక్రయాలవల్ల విద్యార్థులుసైతం చెడువ్యసనాలకు అలవాటుపడుతున్నారు. నిబంధనలను ఉల్లంఘించి బార్లను తలపించేవిధంగా నడుపుతున్న బెల్టుషాపులపై దృష్టిసారించాలని గ్రామీణులు ఎక్సైజ్‌శాఖ అధికారులను మొరపెట్టుకుంటున్నారు.

## మేలుజాతి పాడి పశువుల వృద్ధి

-ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
-ధన్యవాదాలు తెలిపిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, మార్చి 19, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో మేలుజాతి పాడి పశువులను వృద్ధిచేయడానికి ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో ఫ్రోజోన్ సెమన్ బుల్‌స్టేషన్‌ను రూ.21.06కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టంచేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే శంకర్ జీరో అవర్‌లో కంసాన్‌పల్లిలో పశు వీర్య అభివృద్ధిసంస్థ నిర్మాణం గురించి ప్రభుత్వాన్ని అడిగారు. దీనిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందిస్తూ కంసాన్ పల్లిలో రూ.21.06కోట్లతో ఫ్రోజోన్ సెమన్ బుల్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నామని తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీనిని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఈస్టేషన్ ద్వారా ఏడాదికి పదిలక్షల ఫ్రోజోన్ సెమన్ దోసుల ఉత్పత్తిసామర్థ్యం ఏర్పడుతుందని తెలిపారు. పశు సంవర్ధకశాఖకు ఈబడ్జెట్‌లో రూ.1,674కోట్లను ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నట్లు ఎమ్మెల్యే శంకర్ మీడియాకు తెలిపారు. అడిగినవెంటనే నిధులు ఖర్చుచేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం శుభసూచకమని అన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు నియోజకవర్గ రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలి

-జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



వసతిగృహాన్ని తనిఖీ చేసి సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ సుధీర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 19, ప్రభాతవార్త:**

ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ వైద్య అధికారులకు సూచించారు. బుధవారం తాండూర్ మండలం జినుగుర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అదనపు కలెక్టర్ ఆకస్మికతనిఖీచేసి సిబ్బందివివరాల ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని ఇన్‌పేషెంట్, లాబొరేటరీ, మందుల నిల్వగదితోపాటు ఔట్‌పేషెంట్, తదితరరిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా భవనపరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రి మరమ్మతుపనులను పూర్తిచేయాలనీ, పరిసరప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలాచూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో అవసరాలకు అనుగుణంగా లైట్లు,ఫ్యాన్లు సమకూర్చాలని తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధపరీక్షలు, అందిస్తున్న వైద్యసేవలు, ఆసుపత్రిలో అవసరమైనమందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం బిసి బాయ్స్ హాస్టల్‌ను ఆకస్మికతనిఖీచేశారు. హాస్టల్‌లో మరమ్మతుపనులు పూర్తిచేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థులకు ఎస్‌ఎస్‌సి పరీక్షలపై పలుసూచనలు చేశారు. ఆకస్మిక పర్యటనలో హాస్టల్ వార్డెన్ శ్రీశైలం, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

## అన్నివర్గాల సంక్షేమ బడ్జెట్ ఇది

-ప్రభుత్వ ఛీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:**

అన్ని వర్గాల సంక్షేమంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి కోసం తపిస్తూ క్రోఢీకరించబడిన బడ్జెట్‌ను ప్రభుత్వం 2025,26 కోసం తయారు చేసి శాసనసభ, శాసనమండలి ముందుంచింది. విద్య, వైద్యం, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో నేతృత్వంలో తయారైన బడ్జెట్‌ను మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబులు ప్రవేశపెట్టారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలు ఇతోధికంగా అభివృద్ధిచెందేందుకు బడ్జెట్‌ఫలాలు దోహదంచేస్తాయి. బడ్జెట్‌పై కొందరి రన్నింగ్‌కామెంట్రీలు అటు ఉంచితే, ఆర్థికస్థితిగతులు సరిగాలేకున్నా తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి కోసం బడ్జెట్ దోహదం చేస్తుంది.

## చురుకుగా విద్యుత్ హైటెన్షన్ స్తంభాల పనులు



ప్రధాన రోడ్డు ప్రక్కన నిర్మిస్తున్న స్తంభం

**నవాబుపేట, మార్చి 19, ప్రభాతవార్త:**

మండలంలోని ఆయాగ్రామాల రెవెన్యూపరిధినుండి భారీ విద్యుత్ హైటెన్షన్ స్తంభాల పనులు చురుకుగా సాగుతున్నాయి. కర్నాటకరాష్ట్రం బీదర్‌నుండి మండలంమీదుగా రంగారెడ్డిజిల్లా శాబాద్ వరకు ఈస్తంభాలు నిర్మాణంకానున్నాయని తెలుస్తోంది. దాదాపు ఏడుగుంటలభూమి విస్తీర్ణంలో ఒకస్తంభం నిర్మిస్తున్నారు. దాదాపుగా మండలంలో 17నుండి 20స్తంభాలు నిర్మాణంచేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. సంబంధిత అధికారులెవ్వరు అందుబాటులో లేకపోవడంతో సరైనసంఖ్య తెలియడంలేదు. ఈస్తంభాలనిర్మాణంద్వారా రైతులు తమవిలువైన భూములను కోల్పోవడం జరుగుతోంది. కొన్నిభూములు కోట్లల్లో ధరపలుకుతున్న తరుణంలో సంబంధిత రైతులు తీవ్ర ఆందోళనచెందుతున్నారు. ప్రభుత్వనిర్ణయంమేరకు వారు సహకరిస్తున్నప్పటికీ అంతర్గతంగా వారు ఆందోళనచెందుతున్నారు. ఈనేపథ్యంలో బాధితరైతులు ఇటీవల జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి అధికమొత్తం నష్టపరిహారం అందించాలనికోరినట్లు బాధితరైతు భోజిరెడ్డి తెలిపారు. మండంలంలో భూములకు విలువ అధికంగా ఉన్నదని దానికితగినట్లుగా పరిహారం ఇవ్వాలని కోరామని అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని రంగారెడ్డిజిల్లాలో అందించే పరిహారానికి సమంగా అందించడానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారనితెలిపారు. ముందుగా తెలిపిన సమాచారంమేరకు ఒకస్తంభానికి నాలుగు పిల్లర్లు ఉంటాయని ఒక పిల్లరుకు నష్టపరిహారంగా లక్షరూపాయలు చెల్లించనున్నట్లు తెలిసిందని భూములు కోల్పోతున్న రైతులు కొందరు చెప్పారు. ఇదిలా ఉండగా హైటెన్షన్ స్తంభాల ఏర్పాటుతో ప్రక్కనున్నభూములపై కూడా తీవ్రప్రభావం చూపనున్నదని పలువురు రైతులు కూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## ఆశావర్కర్లను అడ్డుకున్న పోలీసులు

-కలెక్టరేట్‌వద్ద భారీ ఎత్తున పోలీసుబందోబస్తు, బారికేడ్స్ ఏర్పాట్లు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, శామీర్‌పేట, మార్చి 19, ప్రభాతవార్త:**

రాష్ట్రప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, కనీసవేతనం 18వేలరూపాయలు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ జిల్లాకలెక్టరేట్ ముట్టడికి వెళ్లటానికి పిలుపునివ్వటంతో పోలీసులు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డుకుని సిఐటియు నాయకులను, ఆశావర్కర్లను పోలీసులు అరెస్ట్‌లు చేశారు. బుధవారం ఉదయంనుంచే మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌వద్ద, కొంతదూరంవరకు బారికేడ్స్ ఇరువైపుల ఏర్పాటుచేసి ఆశావర్కర్లు కలెక్టరేట్‌ముట్టడికి రాకుండా ముందస్తుగా పోలీసుబందోబస్తును భారీఎత్తున ఏర్పాటుచేశారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లాకలెక్టరేట్‌కు వివిధమండలాల నుంచి బయలుదేరిన ఆశావర్కర్లను పోలీసులు జిల్లావ్యాప్తంగా అడ్డుకుని అరెస్ట్‌లుచేసి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.అశోక్, కోశాధికారి కె.ఉన్నికృష్ణన్, ఉపాధ్యక్షులు ఎం.కిష్టప్పలు మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వంస్పందించి వెంటనే ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

## నిబద్ధతతో కూడిన ప్రజాబడ్జెట్

-తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 19, ప్రభాతవార్త:**

సిఎం రేవంత్‌రెడ్డికి, బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖమంత్రి భట్టి విక్రమార్కకి తాండూరునియోజకవర్గప్రజల తరపున ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ధన్యవాదాలుతెలిపారు. దేశంలో ఎవరూచేయనిసాహసాన్ని, సంక్షేమపథకాలను సిఎం రేవంత్‌రెడ్డి చేశారన్నారు. 6గ్యారంటీలు అమలుచేస్తున్నామని పేర్కొన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు బడ్జెట్‌కేటాయించడం సంతోషకరమైనవిషయమని, సిఎంరేవంత్‌రెడ్డికి,ఉపముఖ్యమంత్రి,ఆర్థికమంత్రిభట్టివిక్రమార్కకి,మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి,స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు.

# రావమ్మా లక్ష్మీదేవీ.. రావమ్మా..

-సాకారం కానున్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కల
-ఇక నియోజకవర్గంలో వ్యవసాయం కళ
-పాదయాత్రలో స్వయంగా పరిశీలించిన డిప్యూటీ సిఎం భట్టి
-పలుమార్లు సీఎం దృష్టికి తీసుకెళ్లిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్



రిజర్వాయర్ నిర్మాణం కోసం పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్క, వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, మార్చి 19, ప్రభాతవార్త:**

శంకరా గంగ విడుము.. పార్వతి చాలును..అన్న శ్రీనాథకవి సార్వభౌముని వేడుకోలుగా రైతుల ఇన్నేళ్ల ఎదురుచూపులకు వీడ్కోలు పలుకుతూ మనశంకరుడు గంగను విడిచేందుకు సంసిద్ధమయ్యాడు. దశాబ్దాల ఎదురుచూపుల తర్వాత లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ రూపంలో ఆగంగమ్మ షాద్‌నగర్ నియోజకవర్గ తలుపును తట్టబోతుంది. అసెంబ్లీలో బడ్జెట్‌చర్చల్లోభాగంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క షాద్‌నగర్‌లోని ఈరిజర్వాయర్‌కు నిధులను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులతో పాటు రైతన్నలలోకూడా సంతోషం వెల్లివిరుస్తోంది. దశాబ్దాల ఎదురుచూపుల లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రస్థానాన్ని ఒక్కసారి పరిశీలిస్తే..

**అలా మొదలైంది..**

షాద్‌నగర్ నియోజకవర్గంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఏర్పాటుచేయాలన్నది ఉద్యమసమయంలో మాజీముఖ్యమంత్రి కెసిఆర్ సంకల్పం. నియోజకవర్గానికి పశ్చిమవైపు చివరలో ఉన్న ఈ గ్రామం ద్వారా నియోజకవర్గంతోపాటు మూడు జిల్లాలకు నీరు అందించాలన్న సంకల్పం. దీనికి ఆయన 2014 ఎన్నికలముందు స్పష్టమైన హామీ ఇచ్చారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగంగా రూపొందించిన ఈరిజర్వాయర్ ద్వారా రెండుజిల్లాలతోపాటు నల్గొండజిల్లాకుకూడా నీరందించాలన్నది ఆలోచన. అయితే 2014 ఎన్నికల తర్వాత ఈరిజర్వాయర్‌ను కేవలం నియోజకవరానికి పరిమితంచేస్తూ డిజైన్‌మార్చారు. 10టిఎంసిల సాగునీటిని అందించాలన్నది ఆలోచన. ఈమేరకు లక్ష్మీదేవిపల్లి, పద్మారం గ్రామాల్లో భూసేకరణ చేయాలని తలిచారు. అప్పటి మహబూబ్‌నగర్ జిల్లాకలెక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటుచేసి గ్రామస్థులద్వారా భూములు సేకరించేందుకు సిద్ధమయ్యారు. తర్వాత కథలోకి వస్తే..

**ఉద్యమాలు.. పోరాటాలు..**

2014లో తెలంగాణ ఆవిర్భావంతోపాటు కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ చకచకా పూర్తవుతుందని అందరు ఆశించారు. కానీ రిజర్వాయర్ ఒక్క అడుగుకూడా ముందుకు సాగలేదు. దీనిపై పాలమూరు ఉద్యమ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలుపోరాటాలు జరగగా ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క, ఆనాటి ప్రతిపక్షనాయకురాలు వైయస్ షర్మిల, ప్రొఫెసర్ కోదండరాం, యుద్ధనౌక గద్దర్, ఆనాటి ప్రతిపక్షనేత, నేటి ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌లు పెద్దఎత్తున పోరాటాలుచేశారు. భట్టి విక్రమార్క,గద్దర్,శంకర్ పాదయాత్రచేశారు. అయితే అప్పటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమని, ఉదండాపూర్‌వరకు పనులుపూర్తయ్యాయని, త్వరలో రిజర్వాయర్ పూర్తిచేస్తామని హామీనిచ్చినప్పటికీ కూడా ఈప్రాంతంలో ఆందోళనలు ఆగలేదు. ఇక2018 అసెంబ్లీఎన్నికల్లో మరోసారి కెసిఆర్ లక్ష్మీదేవిపల్లిప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. తాను రెండవసారి అధికారంలోకి వస్తే కుర్చీవేసుకొని మరీ ఈరిజర్వాయర్ పూర్తిచేస్తానని చెప్పారు. కానీ రెండవసారికూడా రైతులకు నిరాశే మిగిలింది. ఇక వర్తమానంలోకి వస్తే..

**'వీర్లపల్లి' మళ్లీ మళ్లీ..**

తాను అధికారంలోకివస్తే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను కాంగ్రెస్‌ప్రభుత్వంద్వారా పూర్తిచేయిస్తానని స్థానికప్రజలకు ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వాగ్దానంచేశారు. శంకర్ ఎమ్మెల్యేగాగెలిచాక పలుమార్లు సిఎం రేవంత్‌రెడ్డిని, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలనుకలిసి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఆవశ్యకతగురించి చెప్పారు. భట్టి విక్రమార్క ఇక్కడ పాదయాత్రకూడాచేసి ఈప్రాంత సమస్యను ఎన్నికల సమయంలో తెరపైకి తేవడంలో సఫలీకృతులయ్యారు. ఈరిజర్వాయర్‌పై భట్టివిక్రమార్కకు పూర్తి అవగాహన ఉంది. ఇక అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సాగునీటిరంగానికి రూ.23,373 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో పెండింగ్‌ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, లక్ష్మీదేవిపల్లి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని శాసనసభలో భట్టి విక్రమార్క బుధవారం ప్రకటనచేయడంతో నియోజకవర్గం అంతటా సంబరాలు మొదలయ్యాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు నియోజకవర్గ ప్రజలు, రైతుల తరపున ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే ఇచ్చినమాట నిలబెట్టుకోవడంతో కాంగ్రెస్‌శ్రేణులు సంతోషాన్ని వ్యక్తంచేస్తున్నాయి. గత ప్రభుత్వం పదేళ్లుగా చేయలేనిపని ఏడాది కాలంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిచూపించడాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. మొత్తానికి రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల సాకారంకావడం విశేషం. ఈరిజర్వాయర్ నియోజకవర్గానికి కొత్తకళ తెస్తుందనడంలో సందేహంలేదు. షాద్‌నగర్ నియోజకవర్గం సస్యశ్యామలంగా మారుతుంది.

## లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలి

-జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:**

రంగారెడ్డిజిల్లాలో చిన్నవ్యాపారులు, మధ్యతరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వాటినిప్రోత్సహించేందుకుగాను సూక్ష్మ చిన్న, మధ్యతరహా సంస్థలద్వారా అధికంగా రుణాలను అందించాలని వివిధ బ్యాంక్ అధికారులకు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాకలెక్టర్ సి.నారాయణరెడ్డి అధ్యక్షతన జిల్లాస్థాయిబ్యాంకర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఖరీఫ్,రబీసీజన్లకు సంబంధించి కేటాయించినలక్ష్యాలు, సాధించినప్రగతి, రానున్న సీజన్‌లో రైతాంగానికి అదించాల్సిన పంటరుణాలు తదితర అంశాలపై ఆయాబ్యాంకులవారీగా కలెక్టర్ సమీక్షించారు. పూర్తిస్థాయిలో పంటరుణాలు లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలని రుణపంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని తెలిపారు. ఆయారంగాల్లో పలుబ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని, క్రమంతప్పకుండా సమీక్షజరుపుతూ, వందశాతం లక్ష్యాలసాధనకు కృషిచేయాలని సూచించారు. వ్యవసాయశాఖతోపాటు ఇతరశాఖలతో సమన్వయం చేసుకుని ప్రభుత్వపథకాల కింద ఎంపికైనా లబ్ధిదారులకు సకాలంలో రుణాలందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని అన్నారు. రుణాలు తీసుకున్న వారు యునిట్లు స్థాపించారా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తిస్థాయిలో లింకేజీరుణాలు పంపిణీచేయాలని, సబ్సిడీరుణాల పంపిణీలో జాప్యంచేయవద్దని సూచించారు. అదేవిధంగా ఎస్‌హెచ్‌జీగ్రూపుల యూనిట్లగ్రౌండ్‌లో జాప్యంజరుగుతుందని తెలుపగా, దానిపై కలెక్టర్‌స్పందిస్తూ వెంటనే పనులు వేగవంతంచేయాలనిసూచించారు.విద్యారుణాలు, గృహనిర్మాణాల రుణాలు తక్కువగా ఇచ్చిన బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలనిసూచించారు.మెప్మాద్వారాస్వయం ఉపాధి కల్పించేందుకు పథకాలను, బ్యాంక్ లింకేజీ రుణాలను కూడా త్వరితగతిన గ్రౌండ్ అయ్యేవిధంగా చూడాలని బ్యాంకర్లకు తెలిపారు. తదుపరి జిల్లా లీగల్‌సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శ్రీదేవి మాట్లాడుతూ... ఆర్‌బిఐ గైడ్‌లైన్స్ ఆధారంగా అన్నిబ్యాంకులు తమపరిధిలో పంటరుణాలను అధికంగా ఇవ్వడంతోపాటు మనీలెండర్లవద్ద రైతు రుణాలు తీసుకున్నట్లయితే వారికి బ్యాంక్‌రుణాలు అందించి మనీలెండర్ల నుండి వారిని కాపాడాలని తెలిపారు. ఈసమావేశంలో లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ కుసుమ, నాబార్డు ఏజిఎం, వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీలత, మెప్మా పిడి మల్లీశ్వరి, వివిధ బ్యాంకర్లు పాల్గొన్నారు.

## పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

-జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 19, ప్రభాతవార్త:**

ఈనెల 21వ తేదీనుంచి ఏప్రిల్ 4వరకు పదవతరగతి పరీక్షలు జరుగుతున్నందున పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లావిద్యాశాఖాధికారి విజయకుమారి పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఒ కార్యాలయంలో డిఇఒ విజయకుమారి పదవతరగతి పరీక్షలఏర్పాట్లను జిల్లావిలేకరులకువివరించారు.జిల్లావ్యాప్తంగా పదవతరగతిపరీక్షల కోసం 226రెగ్యులర్ సెంటర్లు, 4ప్రైవేట్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఈసారి కొత్తగా 9పరీక్షాకేంద్రాలు అదనంగా ఏర్పాటుచేశామని ఆమె తెలిపారు. జిల్లావ్యాప్తంగా 903హైస్కూల్స్ ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈసారి పదవతరగతి పరీక్షలకు 47,322మంది విద్యార్థులు హాజరు అవుతున్నట్లు, 608మంది ప్రైవేట్ వారు పరీక్షలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. పరీక్షాపత్రాలు మొదటిసెట్, రెండవసెట్‌లు అందినట్లు సైబరాబాద్ సిపి పరిధిలోని 11పోలీస్‌స్టేషన్లలో, రాచకొండ సిపిపరిధిలోని 10 పోలీస్‌స్టేషన్‌లలో ప్రశ్నాపత్రాలను (స్ట్రాంగ్ పాయింట్స్‌లో) భద్రపర్చటం జరిగిందన్నారు. ఛీఫ్‌సూపరిండెంట్లుగా 230 మంది, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా పరీక్షల నిర్వహణ కోసం 234మంది నియమితులైనట్లు డిఇఒ వివరించారు. పరీక్షలు ఉదయం 9.30గంటలనుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు. కాంపొజిట్ మ్యాథ్స్ రోజున మాత్రం 12.50గంటలవరకు పరీక్షలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈసారి పరీక్షలకు ఉదయం 9.30గంటల 5నిమిషాల పాటు ఆలస్యంగావచ్చినా పరీక్షాకేంద్రంలోకి అనుమతిఉంటుందని ఆమె స్పష్టంచేశారు. అయితే పరీక్షావిధానంలో కొన్ని మార్పులు రావటంజరిగిందన్నారు. గతంలో ఆన్సర్‌షీట్స్ 4 పేజీలు మాత్రమే ఉండి అడిషనల్ పేపర్స్ విద్యార్థులు తీసుకునేవారని, ఈసారి అలాకాకుండా 24పేజీల బుక్‌లెట్ ఆన్సర్‌షీట్‌పేపర్స్ ఒకేసారి ఇవ్వటం జరుగుతుందని, అడిషనల్‌పేపర్ అంటూ ఉండదన్నారు. ఫిజికల్‌సైన్స్, బయోలాజికల్‌సైన్స్ పరీక్షలు గతంలో ఒకేరోజు జరిగేవని, ఈసారి మాత్రం ఒకరోజు ఫిజికల్ సైన్స్, మరొకరోజు బయోలాజికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈరెండు రోజులపాటు జరిగే పరీక్షలు మాత్రం ఉదయం 9.30గంటల నుంచి 11గంటల వరకు జరుగుతాయని అన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్‌పరికరాలు, వస్తువులు పరీక్షాకేంద్రంలోపలికి అనుమతించటం జరగదన్నారు. పరీక్షాకేంద్రాల్లో త్రాగునీరు, సైన్ బోర్డులు ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. సిసి కెమెరాల ముందు పరీక్షాప్రశ్నాపత్రాలు తెరువటం జరుగుతుందన్నారు. పరీక్షాకేంద్రాలవద్ద ఎంఇఒ,డిఇఒల సెల్‌ఫోన్‌నెంబర్లు ఏర్పాటు చేయాలని సూచించినట్లు డిఇఒ విజయకుమారి వివరించారు. రెవెన్యూ,పోలీస్,విద్యాసంబంధిత అధికారులతో 9ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్‌ను నియమించటం జరిగిందన్నారు. పదవతరగతి పరీక్షలు జంబ్లింగ్ విధానంలో నిర్వహించటం జరుగుతుందని, జోన్‌వైజ్‌గా పరీక్షాకేంద్రాలలో విద్యార్థులు పరీక్షలురాయటం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఎవరైనా హాల్‌టికెట్స్ తీసుకోనట్లైతే, ఇబ్బందులు ఏర్పడితే వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునేలా ఎస్‌ఎస్‌సి బోర్డు వారు ఏర్పాట్లుచేశారని అన్నారు. జిల్లాలో పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేసినట్లు డిఇఒ విజయకుమారి తెలిపారు.



డిఇఒ విజయకుమారి పరీక్షల ఏర్పాట్లపై విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

## హన్మాపూర్ గ్రామంలో మరో హత్య

-తల్లి, భార్యలే హత్యచేసారని పుకార్లు !

**పెద్దేముల్, మార్చి 19, ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని హన్మాపూర్ గ్రామంలో మరోహత్య కలకలం రేపింది. బుదవారం తెల్లవారుఝామున హత్య జరిగినట్లు తెలుస్తోంది. గ్రామస్థులు, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలప్రకారం, పెద్దేముల్ మండలం హన్మాపూర్ గ్రామానికి చెందిన బక్కని వెంకటేష్ (33) వ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ జీవనంసాగించేవాడు. వెంకటేష్ మద్యానికి బానిసై ప్రతిరోజు తాగివచ్చి తల్లి,భార్యతో గొడవ పడేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. బుధవారం తెల్లవారుఝామున కన్నతల్లి, కట్టుకున్నభార్య వెంకటేష్‌ను హత్యచేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. హత్యవిషయాన్ని తెలుసుకున్న తాండూరు డిఎస్‌పి బాలక్రిష్ణరెడ్డి, సిఐ నాగేష్, పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనుమానితులైన మృతుడితల్లి లక్ష్మమ్మ,భార్య సబితలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి హత్యకుగురయ్యాడు. తల్లి,నాయనమ్మ పోలీసుల అదుపులో ఉండటంతో ఏదిక్కూ లేనివారిగా దిక్కుతోచనిస్థితిలో చిన్నారులు ఇంటివద్ద ఉండిపోయి తల్లిదండ్రులకోసం రోదిస్తుండటం గ్రామస్థులను కలిచివేసింది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**శంకర్‌పల్లి, మార్చి 19, ప్రభాతవార్త:**

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులకథనం ప్రకారం పిల్లిగుండ్లగ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి(30) సుబిషి కనస్ట్రక్షన్ శంకరపల్లిలో సైటు ఇంజినీరుగా పనిచేస్తున్నారు. విధులు ముగించుకొని తిరిగి ఇంటికి తన ద్విచక్రవాహనంపైన వెళ్తున్నసమయంలో బుల్కాపూర్ రైల్వేఅండర్‌పాస్ దాటగానే గుర్తుతెలియనివాహనం వెనకవైపు నుండి ఢీకొనడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడ్డాడన్నారు. డివైడర్‌కి ఢీకొనడంతో తలకు, శరీరభాగాలకు బలమైన గాయాలుతగలటంతో, చికిత్సకోసం ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలోనే చనిపోయాడన్నారు. ఈవిషయమై మృతునిసోదరుడు ధృవతేజరెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తుజరుపుతున్నట్లు శంకరపల్లి సిఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

## సిగరెట్ కొడుతూ..ఆర్టీసి బస్సు నడుపుతూ

-ఆరేసి ఎండి సజ్జనార్‌కు ఫిర్యాదుచేసిన డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్

**ఇబ్రహీంపట్నం, మార్చి 19, ప్రభాతవార్త:**

ఆర్టీసిబస్సులో అధికారులు 'ఈబస్సు మనందరిది,' 'బస్సులో పొగ త్రాగరాదు,' 'స్త్రీలను గౌరవించాలి' అంటూ అనేకసూక్తులురాసి ప్రజల్లో మార్పులు తేవాలని చూస్తుంటారు. కాని కొందరు ఆర్టీసి ఉద్యోగులకు అవేమీపట్టకుండా తమకు ఇష్టమొచ్చినట్లుచేస్తూ..ప్రశ్నించినవారిని బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఇలాంటిఘటనే బుధవారం యంజిబిఎస్ నుండి మాల్యాపురం వెళ్తున్న ఆర్టీసి బస్సు టిఎస్09జడ్7919లో ఇబ్రహీంపట్నం సమీపంలోకి రాగానే చోటుచేసుకుంది. ఈఘటన పొగాకునియంత్రణ అంతర్జాతీయ అవార్డుగ్రహీత, పౌరసరఫరాలశాఖ ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ కంటపడింది. దీంతో రఘునందన్ సదరుడ్రైవర్‌ను ఆర్టీసి నిబంధనలను ఉల్లంఘించి ప్రయాణికులకు ఇబ్బంది కలిగేవిధంగా పొగ త్రాగరాదని హెచ్చరించాడు. ఈసంఘటనను తన చరవాణిలో చిత్రీకరిస్తుంటే గమనించిన సదరు డ్రైవర్ రఘునందన్‌పై దుర్భాషతో రెచ్చిపోయాడు. దీంతో ఈ ఉదంతాన్ని మొత్తం ట్విట్టర్ ఎక్స్‌లో ఆర్టీసి ఎండి సజ్జనార్ ఐపిఎస్‌తోపాటు హైదరాబాద్ డిపో 1కు ట్యాగ్‌చేసి పోస్టు చేశాడు. స్పందించిన ఆర్టీసి అధికారులు సదరు డ్రైవర్‌పై విచారణజరిపి చర్యలుతీసుకుంటామని తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతంకాకుండా చర్యలుతీసుకుంటామని సమాధానమిచ్చారు.

## కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడ్డ కాంగ్రెస్

**బొంరాస్‌పేట్, మార్చి 19, ప్రభాతవార్త:**

కామారెడ్డి బిసి డిక్లరేషన్‌కు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందని ఇచ్చినమాట నిలబెట్టుకుందని కాంగ్రెస్ ముఖ్యనాయకులు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని కూడలిలో బిసి బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తంచేస్తూ టిపిసిసి ఇచ్చిన పిలుపుమేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు ఆపార్టీశ్రేణులు క్షీరాభిషేకంచేశారు. ఈసందర్భంగా ఆపార్టీముఖ్యనేతలు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బిసిలకు చట్టసభల్లో ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికలముందు 10 నవంబర్ 2023న కామారెడ్డిలో జరిగిన బిసి డిక్లరేషన్ సదస్సులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గౌడతో కలసి టిపిసిసి హోదాలో రాష్ట్ర ముఖ్యమంత్రి బిసి డిక్లరేషన్ ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 15నెలల్లోనే బిసిలసంక్షేమం అభివృద్ధికోసం 42శాతం రిజర్వేషన్‌కల్పిస్తూ బిసిబిల్లు శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించడం చారిత్రాత్మకమని కొనియాడారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ ముఖ్యనేతలు కార్యకర్తలు నర్సింలుగౌడ్, రామచంద్రారెడ్డి, జయకృష్ణ, వెంకట్, రాములుగౌడ్ కోవూరు సంతోష్, భీమ్‌రావు, సంగాయపల్లి నర్సింలు, కుమ్మరి కిష్టప్ప, నరసింహానాయుడు, బుక్క కలీం తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించడంపై సిఎంకు కృతజ్ఞతలు

**సైఫాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** బీసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ శాసన సభ బిల్లు ఆమోదించడంపై అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చిన ఈ బిల్లు దేశానికే ఆదర్శమని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం, అభ్యున్నతి కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు యావత్ బీసి లోకం కాంగ్రెస్ పార్టీ వెంటనే ఉంటుందని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెప్పారు. జనాభాలో బీసిలు ఎంత శాతమో అధికారంలో అంత భాగం అనే కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఆశయాలకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో తగు చర్యలు చేపడుతున్నారని, ఇందులో భాగంగానే సమగ్రంగా కులగణన సర్వే చేపట్టి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపారని ఆయన గుర్తు చేశారు.

## రాజీవ్ యువ వికాసం' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**సైఫాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగ యువతకు విస్తృత పథకాలు ప్రవేశపెట్టాలని చేస్తున్న కృషిలో భాగంగా 'రాజీవ్ యువ వికాసం' అనే పథకాన్ని తీసుకువచ్చిందని దీన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టిపిసిసి ఓబిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్‌చారి సూచించారు. నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కల్పించడమే ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ,బీసి,మైనార్టీలకు రుణం మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని, ఏప్రిల్ 6 నుంచి 30 తేదీ వరకు లబ్ధిదారుల ఎంపిక యూనిట్ల కేటాయింపుల ప్రక్రియ జరుగుతుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను పట్టించుకోకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు వేల కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించినందుకు ప్రత్యేకంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బేగంపేట కార్పొరేటర్



తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న బేగంపేట కార్పోరేటర్ దంపతులు మహేశ్వరి శ్రీహరి.

**బేగంపేట మార్చి 19,ప్రభాతవార్త**
తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారిని బుధవారం బ్రేక్ సమయంలో బేగంపేట కార్పోరేటర్ దంపతులు టి.మహేశ్వరి శ్రీహరి దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని కోరుకున్నామని కార్పోరేటర్ మహేశ్వరి తెలియజేసారు. దేవదేవుని ఆశీస్సులతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నానన్నారు.

## ఒత్తిడిలను అధిగమించి పరీక్షలు రాయాలి



బాగ్‌లింగంపల్లిలో అంబేద్కర్ స్కూల్‌లో పాల్గొన్న విద్యార్థులు, ప్రిన్సిపాల్ తదితరులు

**చిక్కడపల్లి మార్చి 19 ప్రభాతవార్త:** వత్తిడిలను అధిగమించి పరీక్షలను రాసి విజయం సాధించాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు హాల్‌టికెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం మాట్లాడుతూ పదవ తరగతి అనేది జీవితంలో ఒక్క ముఖ్యమైన గట్టమని, ఈ దశలో విద్యార్థులు ఎంతో పట్టుదలతో చదువుకొని మంచి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో రాయాలని. ఎలాంటి ఒత్తిడిలకు లోనుకాకుండా రాయాలన్నారు. విద్యార్థుల పట్ల యాజమాన్యం ఎంతగానో ప్రోత్సహిస్తూ అందుకుకావాల్సిన సహకారాన్ని అందించడం విశేషం. ఈ సందర్భంగా పరీక్షలను రాసే విద్యార్థినీ విద్యార్థులకు ఎగ్జామ్స్ పాడ్స్, జామెంట్రీ బాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమం లో కళాశాల మానేజ్మెంట్, డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొని ఎగ్జామ్స్ రాయబోతున్న విద్యార్థులకి అల్ ది బెస్ట్ తెలియజేస్తూ ముగించారు.

## ఆలిండియా హ్యూమన్‌రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా సిరిగిరి శ్యామ్

**చిక్కడపల్లి, మార్చి 19 ప్రభాతవార్త:** ఆలిండియా హ్యూమన్‌రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా బిఆర్ఎస్ సీనియర్ నేత సిరిగిరి శ్యామ్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంయు.దువా ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా రామ్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంపై జాతీయ స్థాయిలో ఉన్న హ్యూమన్‌రైట్స్ సంస్థకు నగర అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందనానరు. ప్రజలకు మానవ హక్కులను వివరించడంతో పాటు వారిలో చైతన్యం కలిగించే కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తానని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడటానికి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తానన్నారు.

## పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికే 'రాజీవ్ యువ వికాసం'

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** ప్రజల అభివృద్ధి, సంక్షేమ కోసమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం బడ్జెట్‌లో 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రవేశపెట్టిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం సిఎం బడ్జెట్‌లో 6 వేల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ఈ పథకంతో యువతకు ఉపాధి, యువతను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే లక్ష్యమని, అభినందనీయమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## నిమ్స్‌కు సోలార్ ప్యానెల్స్ అందజేత

**పంజగుట్ట, మార్చి 19 (ప్రభాతవార్త):** హైదరాబాద్‌కు చెందిన అకార్డియన్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అకృతి, నిమ్స్ ఆసుపత్రికి నిర్మాణ్ ఎన్జీఓ ద్వారా 20 లక్షల రూపాయాల విలువ చేసే సోలార్ ప్యానల్స్ ను విరాళంగా అందచేశారు. అకార్డ్ మరియు నిర్మాన్ సంయుక్తంగా నిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రానికి సౌర విద్యుత్తును అందించే "ప్రాజెక్ట్ గ్రీన్ డయాలసిస్ ఇనిషియేటివ్" అనే సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేసారు. ఇది 50 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర వ్యవస్థ ఇది రోజుకు 200 యూనిట్లను ఉత్పత్తి చేస్తుంది. నెలకు 65000 ఆదా అవుతుంది. (200 యూనిట్లు, 30 రోజులు 6,000 యూనిట్లు, యూనిట్‌కు 10.8 రూపాయలు). ఈ 200 యూనిట్ల సౌరశక్తిని 40 సెషన్ల డయాలసిస్‌కు ఉపయోగించొచ్చు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ నగరి భీరప్ప మాట్లాడుతూ ఈ సోలార్ పవర్ వలన ఎంతో విద్యుత్ ఆదా కావడమే కాకుండా డయాలసిస్ రోగులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలందించవచ్చని తెలియచేస్తూ దాతలను ప్రతేకంగా అభినందిస్తు ధన్యవాదాలు తెలియచేసారు.

# మందకృష్ణ పోరాటం వల్లనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం



ఖానాపూర్ గ్రామంలో మందకృష్ణ మాదిగ ఫొటోకు పాలాభిషేకం చేస్తున్న మాదిగ సోదరుల దృశ్యం



రాంనగర్ చౌరస్తాలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన దృశ్యం

**నార్సింగి, మార్చి 19 ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అలుపెరుగని మూడు దశాబ్దాల పోరాటం వల్లనే నేడు ఎస్సీ వర్గీకరణ చట్టబద్దత సాధ్యపడిందని ఖానాపూర్ మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామేశ్వరం నర్సింహ్మ పేర్కొన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం ఖానాపూర్ గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద "మందకృష్ణ మాదిగ" చిత్ర పటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ సోదరులంతా కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.గణేష్, పెద్దపులి కిషన్, నరేందర్, పి.శంకర్, ఎల్.దేవదాస్, డి.రాకేష్, బిక్షపతి, గోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**రాంనగర్ చౌరస్తాలో ...**
**చిక్కడపల్లి, మార్చి 19 ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాలు మాదిగ ఉప కులాల వందేళ్ల భవిష్యత్తు కోసం ఉద్యమం చేపట్టి విజయం సాధించిన ఘనత మంద కృష్ణమాదిగకు దక్కుతుందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గండి కృష్ణ మాదిగ, ముషీరాబాద్ నియోజక వర్గం ఇంచార్జ్ గల్లా రాజశేఖర్ మాదిగ అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవ చట్టబద్దతకై ఆమోదం పొందిన సందర్భంగా డివిజన్ ఇంచార్జ్ రోషన్ వినాయక రావు మాదిగ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నేతలు చిలక ఎల్లయ్య మాదిగ, ముచ్చనపల్లి రాములు మాదిగ, తొట్ల గోపి మాదిగ, లక్ష్యం గల్లా నర్సింగరావు మాదిగ, అమ్ముగూడెం దశరథ్ మాదిగ, మీసాల శంకర్ మాదిగ, అల్లగూడ సాయిలు మాదిగ, దేశ్ పాండే నాగరాజు మాదిగ, మహంకాళి వెంకటయ్య మాదిగ, నరేష్ మాదిగ, కలవాల కుమారస్వామి మాదిగ, కుమ్మరి శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

**అల్వాల్‌లో...**
**అల్వాల్, మార్చి 19 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోద ముద్ర వేయడంతో ఎమ్మార్పీఎస్ నేతలు సంబురాలు జరుపుకున్నారు. దశాబ్దాలు కాలంగా సాగించిన పోరాట ఫలితమని తెలిపారు. మంద కృష్ణ మాదిగకు మాత్రమే సాధ్యమైందన్నారు. అల్వాల్ మీ సేవా చౌరస్తా వద్ద తమ అధినేత చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉద్యమ అమర వీరులకు ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జితేందర్‌నాధ్ నేతలు అశోక్ రెడ్డి, రాంచందర్ మాదిగ, బచ్చల కూర స్వామి, సిఎల్ యాదగిరి, ఆనంద్ పాల్గొన్నారు.

**బోయిన్‌పల్లి మారె ్కట్ వద్ద...**
**కంటోన్మెంట్,మార్చి 19 ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం హర్షనీయమని బోయిన్‌పల్లి మారె ్కట్ వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్, కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగలు తెలిపారు. ఎసీ ్స వర్గీకరణను అసెంబ్లీలో బిల్లును ఆమోదించినందుకు బుధవారం బోయిన్‌పల్లి మారె ్కట్ వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్, కాంగ్రెస్ అధినేత్రి,సోనియా గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్తాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి అభినందనలు తెలిపారు.

# రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన ప్రభుత్వ బడ్జెట్

**-కార్పొరేటర్ పావనీ వినయకుమార్**

**చిక్కడపల్లి, మార్చి 19 ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఇది అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ అభయ హస్తం 6 పథకాల మాదిరిగానే రాష్ట్ర బడ్జెట్ వుందని, బుధవారం కార్పొరేటర్ కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్‌తో కలిసి విలేకరులతో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రవేశ పెట్టిన రెండవ బడ్జెట్ రాష్ట్ర ప్రజల అభివృద్ధికి ఆమోదకరంగా లేదనే విషయం మరోసారి రుజువైందని, బడ్జెట్‌లో పేదలకు, రైతులకు, మహిళకు మొండి చెయ్యి చూపిందన్నారు. ఆచరణసాధ్యంకాని హామీలను అమలు చేస్తూ, ముఖ్యంగా మహిళలకు రూ.2500 మహాలక్ష్మి ్మ పథకం, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిర మ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకం ద్వారా రూ.4వేల పెన్షన్ హామీలన్నీ ప్రసంగాలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఏ విధంగా ఉపయోగ పడుతుందో ఒక సారి ఆత్మపరిశీలన చేసుకోవాలని కార్పొరేటర్ గారు సూచించారు. గత ప్రభుత్వ నిర్వాకానికి ఇప్పటికీ కనీస వేతనాలకు నోచుకోని పలు విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు,ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్ పై ఆశలు పెట్టుకున్న ఉద్యోగులకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం లో కార్పొరేటర్ గారితో పాటు బిజెపి గారు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.వినయకుమార్

# వైభవంగా జెడ్‌పిహెచ్‌ఎస్ నిజాంపేట్ వార్షికోత్సవ వేడుకలు..

**నిజాంపేట్, మార్చి 19, ప్రభాతవార్త**
జెడ్‌పిహెచ్‌ఎస్ నిజాంపేట్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్షికోత్సవ కార్యక్రమాలు అంటే కేవలం కాన్వెంట్ స్కూళ్లలో మాత్రమే చూస్తాం, కానీ నేడు ఇక్కడ, ఈ పాఠశాలలో కాన్వెంట్ స్కూల్ కి మించి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. చక్కటి ప్రతిభ కలిగి, విశేషమైన అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే విద్యబోధన జరుగుతుందని, విద్యార్థులు అందరూ చక్కగా చదువుకొని, భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదిగి, మన నిజాంపేట్ కార్పొరేషన్‌కి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. బాచుపల్లి మండల విద్యాధికారి ఎం.వి.వి. రామకృష్ణ మాట్లాడుతూ రేపు జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు చక్కటి ప్రతిభాపాటవాలు కనబరిచి జిల్లాలో మన బాచుపల్లి మండలంను మొదటి స్థానంలో నిలపాలని తెలియజేశారు. పిఆర్‌టియుటిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఇంత గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, వారి ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ సమాజంలో స్త్రీ మూర్తి పాత్రను తెలియజేస్తూ "మగువా, మగువా" పాటకి విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎం సంఘ జిల్లా అధ్యక్షులు రాంరెడ్డి, పిఆర్‌టియుటిఎస్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, టిఎస్‌యూటిఎఫ్ ప్రధాన కార్యదర్శి మదన్, ఎస్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విట్టల్, పిఆర్‌టియుటిఎస్ బాచుపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పర్మగళ్ళ నర్సిములు, మాలి ప్రమోద్ కుమార్ రెడ్డి, పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర బాధ్యులు శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఠాగూర్, ప్రదీప్ సింగ్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి, మల్లేశం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ మేయర్ నీలాగోపాల్‌రెడ్డి

## క్రీడలకు రూ.465కోట్లు కేటాయించడం హర్షణీయం

**-తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి**



ఎల్బీస్టేడియంలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శివసేనారెడ్డి తదితరులు

**హైదరాబాద్, మార్చి 19,ప్రభాతవార్త:**
క్రీడలకు 465 కోట్లు కేటాయించడము గత బడ్జెట్ కన్నా 100 కోట్లు అధికం చేయడం పట్ల తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం క్రీడాకారులు క్రీడా శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో సిఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో పది సంవత్సరాలు నిర్లక్ష్యానికి గురైన క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈసందర్భంగా యావత్ తెలంగాణ క్రీడా కుటుంబ సభ్యులంతా ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేస్తున్నారని తెలిపారు. పెంచిన బడ్జెట్‌తో గ్రామీణ క్రీడ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, క్రీడా సదుపాయాలు, క్రీడాకారులకు ప్రోత్సాహం, క్రీడా కార్యక్రమాల రూపకల్పన, మైదానాల నిర్వహణ, క్రీడ సామాగ్రి పంపిణీ, లాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ వినూత్న కార్యక్రమాలు రూపొందిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అసిస్టెంట్ డైరెక్టర్లు కె ఆర్ బి బట్టర్,అశోక్ కుమార్,కళ్యాణి, పిఆర్‌ఓ సురేష్ కాలేరు, ఎల్బీ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణకు బోరు బావులు ఏర్పాటు



**హైదరాబాద్ మార్చి19,ప్రభాతవార్త :**
వన్యప్రాణుల సంరక్షణ మరియు పర్యావరణ సుస్థిరతను పెంపొందించే దిశగా, వర్చుసా కార్పొరేషన్ యొక్క దాతృత్వ విభాగమైన వర్చుసా ఫౌండేషన్, తెలంగాణలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లో 10 సౌరశక్తితో నడిచే బోరు బావులను విజయవంతంగా ఏర్పాటు చేసింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, నాగర్‌కర్నూల్ మరియు నల్గొండ జిల్లాల్లో 2,611 చ.కి.మీ. విస్తీర్ణంలో, ప్రత్యేకమైన వృక్షజాలం మరియు జంతుజాలానికి ఆశ్రయంగా నిలుస్తోంది. మన్నా నూర్, అమ్రాబాద్, మద్దిమడుగు అటవీ శ్రేణుల్లో ఏర్పాటు చేసిన ఈ సౌరశక్తితో నడిచే బోరు బావులు, వన్యప్రా ణులకు స్థిరమైన నీటి వనరులను అందించడమే కాకుం డా, స్థానిక చెంచు గిరిజన సముదాయానికి కరువు, నీటి సమస్యలను అధిగమించేందుకు సహాయపడతాయి. ఈ ప్రాజెక్ట్, వన్యప్రాణి సంరక్షణలో పర్యావరణ సుస్థిరతకు, సమాజ భాగస్వామ్యానికి వర్చుసా ఫౌండేషన్ నిబద్ధతను స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఫౌండేషన్ ప్రతినిధులు పలు వురు పేర్కొన్నారు.

## క్రమం తప్పకుండా సహేరి కార్యక్రమం

**యూసుఫ్‌గూడ, మార్చి 19, ప్రభాతవార్త :**
రంజాన్ మాసంలో బోరబండ ఎన్ఆర్ఆర్‌పురం సైట్ 1లో సహేరి కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా ఆనవాయితీగా నిర్వ హించడం జరుగుతుందని గ్రేటర్ మాజీ ఉపమేయర్ బోరబం డ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. రంజాన్‌మాసం మొదటి రోజు నుంచి 19వరోజు బుధవారం వరకు కులమతా లకు అతీతంగా సహేరిలో పాల్గొని ముస్లిం సోదరులకు ఆహా రాన్ని స్వయంగా వడ్డించడం మత సామరస్యాలకు ప్రతీక లుగా నిలుస్తుందన్నారు.

# అధికారికంగా పద్మశ్రీ డా. నటరాజ రామకృష్ణ జయంతోత్సవాలు

**- ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల**

**రవీంద్రభారతి, మార్చి 19 ప్రభాతవార్త :**
తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రనాట్య సృష్టికర్త, పేరిణి పునరుద్ధరణ ప్రఖ్యాత నాట్య గురు పద్మశ్రీ డా. నటరాజ రామకృష్ణ 102వ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా ఈ నెల 21వ తేదీ రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహిస్తున్న నృత్యనివాళి అని అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల తెలిపారు. తారామతి బాలాదరిని అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత నటరాజ రామకృష్ణకే దక్కుతుందని, ఎన్నో నాట్యగ్రంథాలు రచించి తరతరాలకు నాట్య విజ్ఞానాన్ని అందించారని ఆమె కొనియాడారు. ఈ మేరకు రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లో సంగీత నాటక అకాడమీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె అకాడమీ కార్యదర్శి బి.మనోహర్, ఓఎస్డీ ఆర్. వినోద్‌కుమార్‌లతో కలిసి సంబంధిత కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించి ఆయా విషయాలను వెల్లడించారు. 21వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, సదస్సు, పత్రసమర్పణల అనంతరం సాయంత్రం జరిగే వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తదితరులు విచ్చేసి కళాకారులను సత్కరిస్తారని ఆమె వివరించారు.

ప్రముఖ నాట్యగురువు, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీతలు డా. కళాకృష్ణ, డా. జొన్నలగడ్డ అనూరాధ, గంధం బసవ శంకర్ తదితరులు అభినయ పూర్వక పత్ర సమర్పణ కావించనున్నారని, ప్రముఖ నాట్యగురువు డా. రమా భరద్వాజ్ నవగ్రహ అవతరణం ప్రదర్శిస్తారని, నటరాజ రామకృష్ణ శిష్యులు పేరిణి శివతాండవం, ఆంధ్ర, లాస్య నృత్యాలు ప్రదర్శిస్తారని డా. అలేఖ్య పుంజాల పేర్కొన్నారు.

## సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



పూర్తికానీ సీసీ రోడ్లు

**జగద్గిరిగుట్ట, మార్చి 19, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శివనగర్‌లో సీసీ రోడ్డు పనులపై త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ బుధవారం సంబంధిత అధికారులు డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిఈ, డివిజన్ ఏఈలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివానగర్‌లో జరిగే అభివృద్ధి పనుల్లో భాగంగా సిసి రోడ్ పనులను జరగకుండా ఆపాలని కొంతమంది అధికార పార్టీ నాయకులు ఫోన్లు చేసి పనులు నిలిపివేయాలని కోరినారని అధికారులు తన దృష్టికి తీసుకొస్తున్నారని తెలిపారు. గాజులరామారం సర్కిల్ 26 డిప్యూటీ కమిషనర్ ఇప్పటికైనా స్పందించి జగద్గిరిగుట్ట డివిజన్‌లోని శివానగర్‌లో సీసీ రోడ్డు పనులు సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే పనులు ప్రారంభించాలని కోరారు. సిసి రోడ్ పనులు ప్రారంభించక పోతే పెద్ద ఎత్తున జోనల్ కమిషనర్ ఆఫీస్ ఎదురుగా ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు.

## విశ్వనగరాభివృద్ధిని బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించారు

**- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**జీడిమెట్ల, మార్చి 19, ప్రభాతవార్త**
తెలంగాణ బడ్జెట్ సమావేశంలో భాగంగా బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్లో మహానగరాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ మహానగరాన్ని నలుమూలల అనుసంధానం చేస్తూ ఎంతోమంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రోకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదు. హైదరాబాద్ నగరానికి ప్రతి సంవత్సరం పదివేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాటలు చెప్పడానికే కానీ చేతల్లో ఉండవని మరో మారు నిరూపిస్తూ హైదరాబాదు నగరానికి నిధులు కేటాయించకపోవడం నగరవాసులను తీవ్రంగా అవమానించడమేనని అన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టి పూర్తిచేసిన ఎస్ఎన్డిపి, ఎస్.ఆర్.డి.పి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణను పూర్తి ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా మార్చేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో శంకుస్థాపన చేపట్టిన మల్టీస్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. దీంతో నిరుపేదలకు అందాల్సిన వైద్యం మరింత ఆలస్యం కానుందని, బడ్జెట్లో ఉన్న నగరాన్ని విస్మరించి ముఖ్యమంత్రి ఊహల నగరమైన ఫ్యూచర్ సిటీ కేంద్రంగా నిధుల కేటాయింపు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ప్రజలను మోసం చేయడానికి ఒక ఎత్తుగడ మాత్రమేగానీ, అభివృద్ధి సంక్షేమం గురించి కాదని అన్నారు.

## చిత్రపురి హౌసింగ్ సొసైటిపై మరో 18 కేసులు

**సైఫాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** చిత్రపురి హౌసింగ్ సొసైటి కమిటీపై 12 కేసులు చార్జ్ షీట్ దాఖలు చేయడంపై చిత్రపురి సాధన సమితి అధ్యక్షుడు కస్తూరి శ్రీనివాస్, ప్రజా నాట్యమండలి సినిమా శాఖ కార్యద ర్శి మద్దినేని రమేష్ హర్షం వ్యక్తం చేశారు. చిత్రపురిలో 300 కోట్ల రూపాయలు విలువగల భూముల కుంభ కోణం, ప్లాట్ల భుంభకోణం, 449 సభ్యత్వాల ట్యాం పరింగ్, 189 మార్ఫింగ్ ఆలాట్‌మెంట్స్, ఫోటోలు లేని 220 మంది సభ్యులు, 336 అక్రమ రిజిస్ట్రేషనలు జరిగినట్లుగా ప్రభుత్వమే దృవీకరించిన నేపథ్యం లో ఆర్థిక నేరాల విభాగానికి చెందిన సైబరాబాద్ పోలీసులు ఇప్పటికి 12 చార్జ్ షీట్‌లు ఎల్‌బి నగర్ కోర్టులో దాఖలు చేశారని వారు తెలిపారు. బెయిల్ కండిషన్స్ దిక్కరణ విషయంలో సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్‌ను తిరస్కరించిందని, ఇప్పటికే హౌసింగ్ సొసైటి అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ గత 20 రోజుల నుంచి చర్లపల్లి జైల్‌లో ఉన్నారని, ఈ సమయంలో మరో 18 చార్జ్‌షీట్‌లు దాఖలు చేయడం చిత్రపురి అక్రమార్కులు చేసిన అన్ని కుట్రలు వెలుగులోకి వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి అనిల్ కుమార్‌పై ఇంకా కఠినమైన చర్యలు తీసుకోవాలని, సినీ రంగానికి చెందిన అర్హులైన వారికి ప్లాట్‌లు ఇవ్వాలని వారు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసే మునిపల్లె రాజు రచనలు

**-సీనియర్ సంపాదకుడు బైస దేవదాసు**

**రవీంద్రభారతి, మార్చి 19 ప్రభాతవార్త :** ప్రఖ్యాత రచయిత మునిపల్లె రాజు రచనలు ప్రతీఒక్కరినీ ఎంతగానో ఆలోచింపజేసే సాంద్రత కలిగి ఉంటాయని, శతజయంతి జరుపుకొంటున్న ఆయన కథాఋషి అని సీనియర్ సంపాదకుడు బైస దేవదాసు అన్నారు. మునిపల్లె రాజు కథలు కాలక్షేప కథలు కావని, రష్యన్ సాహిత్య ప్రభావం వారిపై ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, కణ్వన ట్రస్ట్, ఎంవిఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో మునిపల్లె రాజు శతజయంతి సందర్భంగా ప్రముఖ కవి విహారి అధ్యక్షతన జరిగిన సాహిత్య పురస్కార సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బైస దేవదాసు విశిష్ట అతిథులు అనిల్ అట్లూరి, సిఎస్.రాంబాబు, బి.చంద్రశేఖర్, అనిల్ కిశోర్ మునిపల్లె, మట్టిగుంట వెంకటరమణ తదితరులతో కలిసి 2024 సంవత్సరానికిగాను ప్రముఖ సాహితీవేత్త సుధామ, 2025 సంవత్సరానికిగాను సుప్రసిద్ధ కథా, నవలా, సినీరచయిత పి.చంద్రశేఖర అజాద్‌లను ఘనంగా సత్కరించి మునిపల్లె రాజు సాహిత్య పురస్కారాలను అందజేసి వీరిరువురు ఈ పురస్కారాలకు అన్నివిధాలా అర్హులని వారిని ఎంతగానో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## కాలనీల అభివృద్ధికి కృషి : కార్పొరేటర్

**యూసుఫ్‌గూడ, మార్చి 19, ప్రభాతవార్త :**
బస్తీల కాలనీలలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా కృషి చేయడం జరుగుతుందని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ వార్డు కార్యాలయంలో అన్ని బస్తీల కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు సీనియర్ నాయకులతో కలిసి బస్తీల అభివృద్ధి కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల కాలనీలలో కోట్లాది రూపాయలతో స్థానిక ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు సహకారంతో అన్ని వసతులు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరలోనే పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, జాహేద్ షరీఫ్, బొల్లు శ్రీనువాస రావు,జ్ఞానేశ్వర్, యోగిరాజు స్వామి, సయ్యద్ రియాజ్, రమేష్, రవిందర్‌రెడ్డి, జితేందర్, సంజీవరెడ్డి, పాల్గొన్నారు.

## కురిమిద్దలో చలివేంద్రం ప్రారంభించిన జోసెఫ్



కురిమిద్ద చలివేంద్ర ఏర్పాటు చేసిన జోసఫ్ , యువజన సంఘాలవారు గ్రామస్తులు

**యాచారం మార్చి 19 ప్రభాతవార్త :** వేసవికాలంలో విద్యార్థులకు ప్రయాణికులకు చల్లని త్రాగునీరు అందించడమే లక్ష్యంగా చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు కురిమిద్ద మాజీ ఉపసర్పంచ్ జోసెఫ్ తెలిపారు. యాచారం మండల పరిధిలోని కొరిమిద్ద గ్రామంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొనీ ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసే చలివేంద్రం కార్యక్రమాన్ని ఈ సంవత్సరం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు మాజీ సర్పంచ్ జోసెఫ్ తెలిపారు. ఇలాంటి సేవలు అందించడం ఎంతో సేవాభావంతో కూడుకున్నదని జోసఫ్ ను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. గ్రామంలోయాచారం మండలం కుర్మిద్దలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ జీ. జోసఫ్ ఆర్థిక తోడ్పాటుతో ప్రధాన సెంటర్లో చలివేంద్రాన్ని బుదవారం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ముందుగానే ప్రారంభించారు. గ్రామంలో యువత గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్,మార్చి 19 ప్రభాతవార్త :**
బిసి రిజర్వేషన్ బిల్లు,ఎస్సీ వర్గీకరణ బిల్లు శాసన సభలో ఆమోదించినందుకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముజీబుల్లా షరీఫ్,చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్,యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.రవిరాజులు కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

IN THE COURT OF THE HON'BLE PRL DISTRICT JUDGE AT SANGAREDDY
I.A.NO. 770 OF 2024
IN
AS.NO. 17 OF 2022

Between:
Sareddigari Bala Krishna Reddy and others ...Petitioners/Appellants No.1 to 7
Kandakatla Ram Reddy and others ...Respondents/Respondents No. 1 to 6
And
Kandakatla Jayamma and others ...Respondents/Proposed Respondent No. 7 to 9

NOTICE

To,
Kandakatla Priyanka D/o. Late Raji Reddy, Aged about 29 years, R/o. Plot No.408, Sy No: 91, KLR Vijayanagar Colony, Phase-II, Medchal Village and Mandal, Medchal - Malkajgiri District.
Take Notice that the above named appellants Sareddigari Bala Krishna Reddy and others have filed the above appeal before the Hon'ble Prl District Judge, Sangareddy against the judgment and decree in Os No.68/2012, on the file of the Hon'ble Senior Civil Judge at Sangareddy against you i.e., Respondent no. 8.
That the above case is posted to **25/03/2025** for your appearance and you make it convenient and appear before the Honble Prl District Judge, at Sangareddy on **25/03/2025 at 10.30 AM** by in person or through Advocate to represent the case or else you will be set ex-parte and the case will be decided in your absence.

//BY COURT ORDER//
G.Hanumantha Reddy
Advocate
H.No.4-8-19, Manjeera Nagar, Sangareddy Town & Dist, T.S.-502 001
Cell : 9440081035

IN THE COURT OF THE HON'BLE PRL DISTRICT JUDGE AT SANGAREDDY
I.A.NO. 768 OF 2024
IN
AS.NO. 15 OF 2022

Between:
Sareddigari Bala Krishna Reddy and others ...Petitioners/Appellants No.1 to 7
Kandakatla Ram Reddy and others ...Respondents/Respondents No. 1 to 6
And
Kandakatla Jayamma and others ...Respondents/Proposed Respondent No. 7 to 9

NOTICE

To,
Kandakatla Priyanka D/o. Late Raji Reddy, Aged about 29 years, R/o. Plot No.408, Sy No: 91, KLR Vijayanagar Colony, Phase-II, Medchal Village and Mandal, Medchal - Malkajgiri District.
Take Notice that the above named appellants Sareddigari Bala Krishna Reddy and others have filed the above appeal before the Hon'ble Prl District Judge, Sangareddy against the judgment and decree in Os No.68/2012, on the file of the Hon'ble Senior Civil Judge at Sangareddy against you i.e., Respondent no. 8.
That the above case is posted to **25/03/2025** for your appearance and you make it convenient and appear before the Hon'ble Prl District Judge, at Sangareddy on **25/03/2025 at 10.30 AM** by in person or through Advocate to represent the case or else you will be set ex-parte and the case will be decided in your absence.

//BY COURT ORDER//
G.Hanumantha Reddy
Advocate
Sangareddy
H.No.4-8-19, Manjeera Nagar, Sangareddy Town & Dist, T.S.-502 001
Cell : 9440081035

IN THE COURT OF THE HON'BLE PRL DISTRICT JUDGE AT SANGAREDDY
I.A.NO. 769 OF 2024
IN
AS.NO. 16 OF 2022

Between:
Sareddigari Bala Krishna Reddy and others ...Petitioners/Appellants No.1 to 7
Kandakatla Ram Reddy and others ...Respondents/Respondents No. 1 to 6
And
Kandakatla Jayamma and others ...Respondents/Proposed Respondent No. 7 to 9

NOTICE

To,
Kandakatla Priyanka D/o. Late Raji Reddy, Aged about 29 years, R/o. Plot No.408, Sy No: 91, KLR Vijayanagar Colony, Phase-II, Medchal Village and Mandal, Medchal - Malkajgiri District.
Take Notice that the above named appellants Sareddigari Bala Krishna Reddy and others have filed the above appeal before the Hon'ble Prl District Judge, Sangareddy against the judgment and decree in Os No.68/2012, on the file of the Hon'ble Senior Civil Judge at Sangareddy against you i.e., Respondent no. 8.
That the above case is posted to **25/03/2025** for your appearance and you make it convenient and appear before the Hon'ble Prl District Judge, at Sangareddy on **25/03/2025 at 10.30 AM** by in person or through Advocate to represent the case or else you will be set ex-parte and the case will be decided in your absence.

//BY COURT ORDER//
G.Hanumantha Reddy
Advocate
Sangareddy
H.No.4-8-19, Manjeera Nagar, Sangareddy Town & Dist, T.S.-502 001
Cell : 9440081035


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## బిఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం మానుకోవాలి

**సిద్దిపేట అర్బన్, మార్చి 19,ప్రభాతవార్త :** రంజాన్ పండుగ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థలు పేద ముస్లింలకు రంజాన్ తోఫాలు పంపిస్తే తామే ఇస్తున్నట్లుగా బిఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) మండి పడ్డారు. సిద్దిపేటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో అక్రమంగా సంపాదించిన సొమ్ము నుంచి ఇవ్వాల్సింది పోయి స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న జకాత్‌లకు బిఆర్ఎస్ నాయకులు తమ ఫోటోలు పెట్టుకొని ఇవ్వడం సరికాదన్నారు. బిఆర్ఎస్ నాయకులు సొంత డబ్బులతో రంజాన్ తోఫాలు పంపిణీ చేయకుండా ఇతరులు ఇచ్చినవాటికి తామే ఇస్తున్నట్లు ఫొటోలు పెట్టుకొని ఫోజులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ చాలా కీలకం : ఎఎస్ఐ


మాట్లాడుతున్న ఎఎస్ఐ బాలగంగాధర్ తిలక్

**కోహెడ, మార్చి 19, ప్రభాతవార్త :** విద్యార్థి దశ చాలా కీలకమని ఎఎస్ఐ బాలగంగాధర్‌తిలక్ అన్నారు. మండల పరిధిలోని చంచల్‌చెరువుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, మత్తు పదార్థాలు, నూతన చట్టాలు, ఈవిటీజింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల రక్షణకు పోలీసులు ఎప్పుడు అండగా ఉంటారని తెలిపారు. తాత్కాలిక అనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, పోలీసు సిబ్బంది ప్రశాంతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాములపర్తి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈఓ


విద్యార్థితో పాఠం చదివిస్తున్న ఎంఈఓ వెంకట్రాములు

**మర్కుక్, మార్చి 19 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి వెంకట్రాములు అకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులను, మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యాబోధన పట్ల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠ్యపుస్తకంలోని పాఠాలను విద్యార్థులను నేరుగా చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆయనతో పాటు సిఆర్‌పి లచ్చిరామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఇండస్ట్రియల్ పార్కుకోసం మా భూములు లాక్కోవద్దు


అధికారుల ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

**అక్కన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త :** మండలంలోని చౌటపల్లిలో నిర్మించబోయే ఇండస్ట్రియల్ పార్కుకు మా భూములు లాక్కోవద్దని,ఎట్టి పరిస్థితిలో మా భూములు పార్కుకు ఇవ్వబోమని గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో రైతులు,ప్రజలు స్పష్టం చేశారు.ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి బుధవారం తోటపల్లి, జనగామ, చౌటపల్లి గ్రామస్థులతో గ్రామసభ నిర్వహించారు. కాగా నిర్వహించిన గ్రామ సభలో భూములు కోల్పోతున్న రైతులు అధికారుల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జీవనాధారమైన భూములు ఇండస్ట్రీల కోసం ఇస్తే ఎలా బ్రతకాలని వారు ప్రశ్నించారు.అనంతరం ఆర్డీవో రాంమూర్తికి వినతి పత్రాన్ని అందజేశారు.గ్రామ సభలో హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్, హుస్నాబాద్ అక్కన్నపేట తహసీల్దార్‌లు రవీందర్‌రెడ్డి, అనంతరెడ్డి ఉన్నారు.

## ప్రజల సమస్యలు అధికారులకు పట్టవా...?

### జిల్లా అధికారులు స్పందించాలని పట్టణ ప్రజల వేడుకోలు

**చేర్యాల, మార్చి 19,ప్రభాతవార్త :** చేర్యాల మున్సిపల్ పరిధిలోని పలు వార్డులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి.4,8వ వార్డులోనే కాకుండా మరికొన్ని వార్డుల్లో చెత్త సేకరణకు సిబ్బంది రాకపోవడం చెత్తను ఇంట్లో పెట్టుకోలేక కొంత మంది వీధుల్లో మరికొంత మంది డ్రైనేజీల్లో చెత్త చెదారాన్ని వేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగా సిబ్బంది సరైన తీరులో పని చేయకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు.మరి కొన్ని వీధుల్లో చెత్త సేకరణకు వాహనాలు ఎప్పుడు వస్తున్నాయో ఎప్పుడు వెళ్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది.అలాగే పట్టణంలోని బాలాజీ థియేటర్ మూలమలుపు వద్ద మిషన్ భగీరథ పైపు లీకు కావడంతో అందులోకి మురుగు నీరు కలిసిపోతుంది.ఈ విషయాలపై ప్రభాతవార్త మున్సిపల్ కమీషనర్ నాగేందర్‌ను వివరణ కోరగా సమస్యతో ఉన్న వార్డులు సిబ్బంది అనారోగ్య సమస్యలతో ఉన్నప్పుడు వార్డులో సమస్యలు పేరుకుపోతుంటాయని, అలాగే బాలాజీ థియేటర్ మూలమలుపు వద్ద మిషన్ భగీరథ వాటర్ లీకేజీ జరుగుతుండటంతో ఇప్పటి మూడు సార్లు మరమ్మతులు చేయించాము,పట్టణంలో పనులు నడుస్తున్న కారణంగా సమస్యలు తలెత్తున్నాయని వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు.


మిషన్ భగీరథ పైపు లీకు కావడంతో మురుగు నీరు చేరుతున్న దృశ్యం

# జాతరలో అంబరాన్నంటిన బండ్ల ఊరేగింపు

**కొడిపల్లి, మార్చి 19, ప్రభాతవార్త:** తునికి శ్రీనల్ల పోచమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం బండ్ల ఊరేగింపు జరిగింది. జాతరకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చిర అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి బోనాలను సమర్పించడానికి భక్తులు డప్పుచప్పుళ్ల, శివసత్తుల పూనకాలతో నల్ల పోచమ్మ అమ్మవారి నామ స్మరణతో ఊరేగింపుగా వచ్చి ఆలయ చుట్టూ ప్రదక్షణలు చేసి నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు ఒడి బియ్యాలు, కుంకుమార్చనలుచేసి, జంతు బలి ఇచ్చి మొక్కలు తీర్చకున్నారు. కాగా హైదరాబాద్ నుండి వచ్చిన హిజ్రాల బృందం శ్రీనల్ల పోచమ్మ తల్లికి తమశైలిల్లో బోనాలను తయారు చేసి తల్లికి సమర్పించుకున్నారు. ఉదయం తునికి జాతరను సందర్శించి, అమ్మవారికి పూజలు చేయడానికి విచ్చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డికి ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఈఓ ఆమెకు శాలువాతో సన్మానం చేశారు. మెదక్ పిసిసి అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడు, ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, మండల అధ్యక్షులు పట్లోరి శ్రీనివాస్‌రావు, విచ్చేసి పూజలు జరిపించారు. వీరిని ఈవో శాలువాలతో సన్మానించి, అమ్మవారి లడ్డులను అందజేశారు. అలాగే ఆలయానికి వచ్చిన నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీరామ్‌కి ఆలయ సిబ్బంది సాగరంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.


తునికి జాతరలో బండ్లను ఊరేగింపు కొనసాగుతున్న దృశ్యం.


మాట్లాడుతున్న వీరస్వామి

## పాలసీలపై జీఎస్టీ తొలగించి బోనస్ పెంచాలి

**హుస్నాబాద్ రూరల్, మార్చి 19, ప్రభాతవార్త :** భారతీయ జీవిత బీమా పాలసీలపై కేంద్రప్రభుత్వం విధిస్తున్న జీఎస్టిని పూర్తిగా తొలగించి పాలసీదారులకు బోనస్ పెంచాలని హుస్నాబాద్ బ్రాంచ్ లియాఫీ ప్రధానకార్యదర్శి వేముల వీరస్వామి డిమాండ్ చేశారు.బుధవారం పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారతీయ జీవిత బీమాసంస్థలో ఏజెంట్లుగా పని చేస్తున్న న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలని కోరుతూ ఆల్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరుగుతున్న శాంతి యుత నిరసన కార్యక్రమానికి కార్యాలయం ముందు కూర్చుని మద్దతు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏజెంట్లు మల్లారెడ్డి,రాజేంద్రప్రసాద్,మల్లిఖార్జున్, రాజు, మార్కండేయ, సంపత్‌రెడ్డి, సత్యనారాయణ, నాగభూషనం, తిరుపతి, వాసుదేవచారి, వెంకటయ్య, రవీందర్, రాజేశం, తిరుపతి,రాజు ఉన్నారు.

## నక్ష ప్రాజెక్టుకు ఎంపికైన హుస్నాబాద్


సర్వే పనులు పరిశీలిస్తున్న కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 19,ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్ష సర్వేకు హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎన్నికనట్లు మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ తెలిపారు.ఈ నక్ష ప్రాజెక్టులో దేశ వ్యాప్తంగా 152 మున్సిపాలిటీలు ఎంపిక కగా తెలంగాణ రాష్ట్రం నుండి 10మున్సిపాలిటీలలో హుస్నాబాద్ కూడా ఎంపిక కావడం సంతోషకరమైన విషయమన్నారు. నక్షప్రాజెక్టు కోసం బుదవారం అధికారులు సర్వే నిర్వహించగా సర్వే పనులను కమిషనర్ స్వయంగా పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ నెల రోజుల క్రితం హుస్నాబాద్ మున్సిపాలిటీని హెలిక్యాప్టర్ ద్వార కూడా సర్వే చేయడం జరిగిందని,ఈ సర్వేతో హుస్నాబాద్ నక్షను జియో టాగింగ్ చేయడం జరుగుతుందని,తద్వార మున్సిపాలిటీలో ఆస్థి లావాదేవీలు సులబమౌతాయన్నారు.పట్టణ మౌళిక సదుపాయాలతో పాటు అభివృద్ది చేసుకునేందుకు ఈ ప్రాజెక్ట ఉపయోగపడుతుందన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్స్, పెన్నులు అందజేత

**చేర్యాల, మార్చి 19, ప్రభాతవార్త :** మండలంలోని పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్స్,పెన్నులను బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ అందించారు.ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.తల్లిదండ్రుల ఆశయాలతో పాటు స్వంత ఊరుకు మంచి పేరు సంపాదించి పెట్టాలన్నారు.కార్యక్రమంలో ఎంఈవో రచ్చ కిష్టయ్య,గ్రామ నాయకులు గర్నెపల్లి చంద్రం,కొక్కొండ వినోద్,పోలోజు రాజబాబు,దుబ్బాక కనకయ్య,పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## వాస్తవాలను ప్రతిబింబిస్తున్న రాష్ట్ర బడ్జెట్

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ వాస్తవాలను ప్రతిబింబించేలా ఉందని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు.బుదవారం రోజున ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.అయితే విడేదల చేసిన బడ్జెట్‌లో విద్యా,వైద్య రంగాలకు కాస్త ప్రధాన్యత తగ్గిందని ఈ రెండు రంగాలకు అధిక నిధులు కేటాయిస్తే భవిష్యత్తులో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండేదన్నారు.గత పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం కాగితాలలో అధికంగా చూపించి వినియోగంలో చూపించలేకపోయారన్నారు.ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను పూర్తిగా వినియోగించి అభివృద్ధి దిశగా ప్రయాణం చేయడంతో పాటు ప్రజలపై ఆర్థిక భారం మోపకుండా చూసుకోవాలన్నారు.

## అక్రమాలను ప్రశ్నిస్తే దాడికి యత్నించడం సిగ్గుచేట

### మాజీ ఎమ్మెల్యే రసమయి

**బెజ్జంకి, మార్చి 19, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేస్తున్న అక్రమాలను ప్రశ్నిస్తే అనుచరులతో ఇంటిపైకి దాడికి యత్నించడం సిగ్గు చేటని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బుధవారం ఆయనను గుండారంలోగల ఫాంహౌస్‌లో హౌస్ అరెస్టు చేయడంతో బిఆర్ఎస్ నాయకులు ఎవరూ అధైర్యపడవద్దని ఎలాంటి ఇబ్బంది లేదని మీడియోతో కూడిన సందేశాన్ని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ట్విట్టర్ వేదికగా ఈ సంఘటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు స్పందిస్తూ రసమయి బాలకిషన్ భద్రతకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

**జహీరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** పట్టణంలో ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయిన కార్పోరేటర్ దుకాణ బాధితులకు పట్టణంలోని మాణిక్ ప్రభు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృంధం సభ్యులు ఆర్థిక సహాయం అందచేశారు. కార్పెంటర్ మారుతి సతీమణి సువర్ణకు 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యం వెంకటయ్య అందేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారికి ఆదుకుంటే కలిగే మానసిక ప్రశాంతత అంతా ఇంత కాదని, ప్రతి ఒక్కరు ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని వెంటకయ్య పేర్కొన్నారు.

## ఎంపి శెట్కార్‌కు లింగాయత్‌ల కృతజ్ఞతలు

**న్యాల్‌కల్, మార్చి 19, ప్రభాతవార్త:** వీరశైవ లింగాయాత్‌లను ఓబిసిలో చేర్చాలని జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావించడం పట్ల మండల వీరశైవ లింగాయత్ గౌరవ అధ్యక్షులు గార్లపల్లి శివరాజ్, అధ్యక్షులు హోతి శివరాజ్‌లు హర్షం వ్యక్తం చేశారు. వీరశైవులను ఓబిసిలో చేర్చకపోవడంతో వీరశైవులు పడుతున్న ఇబ్బందులు అన్ని ఇన్ని కావని వారు గుర్తు చేశారు. పార్లమెంట్ సమావేశంలో వీరశైవుల సమస్యల పరిష్కారానికి వీరశైవలను ఓబిసిలో చేర్చాలని ప్రస్తావించిన ఎంపి సురేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


సిఎం,మంత్రులకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

## సిఎం,మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

**చిన్నకోడూరు, మార్చి 19, ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ వెనుకబడిన బీసీ కులాలకు కుల గణన చేసి తగిన రిజర్వేషన్ కల్పించి ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన మాటకు కట్టుబడి కుల గణన చేసి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి అమోదం పొందేందుకు కృషిచేసిన సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా మంత్రులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మీసం మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం చిన్నకోడూరులో వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అసెంబ్లీలో బిసి బిల్లు అమోదం పొందిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరుశరాం, రాజేష్, భూపతిరెడ్డి, గుండు వెంకట్, యూసఫ్, జయంత్, వినోద్, జగన్, రాజు, భాస్కర్, రాజు, తిరుతిరెడ్డి, శ్రీకాంత్, అనిల్, నాగరాజు, కుమారస్వామి, చందు,రాజు, మధు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ బిల్లుకు ఆమోదం


స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

**చిన్నకోడూరు, మార్చి 19, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 30 యేండ్లుగా మంద కృష్ణ మాదిగ చేసిన అలుపెరగని పోరాట ఫలితమేనని ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షులు జేరిపోతుల లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మల్లమారి రంగరాజులు అన్నారు. చిన్నకోడూరులో బుధవారం డప్పుచప్పుళ్లతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేసి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు కొట్టెపల్లి పర్శరాములు, కొలను రమేష్, కొలమద్ది రంజిత్, గాజుల రవి, మాంకాళి అశోక్, గాజుల నందం, ఎర్ర మురళి, స్వామి, శంకర్, మల్లయ్య, బాపురాజు, భాస్కర్, శంకర్, ఇషాక్, మాంకాళి శంకర్ తదితరులు పాల్గొన్నారు.అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## రైతులకు శాపంగా మారిన సిఎం : శ్రీనివాస్

**చిన్నకోడూర్, మార్చి 19, ప్రభాతవార్త :** రైతుల పాలిట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాపంగా మారారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ అన్నారు.బుదవారం రోజున మండల కేంద్రంలోని సన్‌ఫ్లవర్(పొద్దు తిరుగుడు) కొనుగోలుకేంద్రాన్ని సందర్శించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగాఉంటామని అధికారంలోకి వచ్చాక వస్మరిస్తోందన్నారు. రైతులు పండించిన పొద్దుతిరుగుడు పంట అమ్ముకుందామని వెళ్తే ఎకరాకు 6 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ఆంక్షలు విధించడం సబబు కాదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు తలెత్తుకుని బతకాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్,మంత్రి తన్నీరు హరీష్‌రావులు రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు నిర్మిస్తే ఇప్పుడిప్పుడే రైతులు ఓ దారికి వస్తుంటే వారి కష్టాన్ని గుర్తించాల్సింది పోయి ఎకరాకు ఇంతే కొంటామని నిబంధనలు పెట్టడం సిగ్గుచేటన్నారు.ఇలాంటి నిబంధనను ఎత్తివేయకుంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలసి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.కార్యక్రమంలో రైతులు రాజిరెడ్డి, చంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజేష్, మల్లయ్య, బాలరాజు రమేష్ ఉన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం

### గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమాసాహెబ్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుకు నిధులు కేటాయించకుండా వారికి తీవ్ర అన్యాయం చేసిందని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బీమాసాహెబ్ అన్నారు.బుదవారం రోజున ప్రభుత్వం విడుదలచేసిన బడ్జెట్‌పై ఆయన స్పందించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు సమ్మక్క సారక్క పథకంతోపాటు అంబేద్కర్ అభయహస్తం, ఉమ్మడి జిల్లా ప్రతిపాదికన 5 ఐటిడిఎలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. ప్రభుత్వం గిరిజన శాఖకు కేటాయించిన నిధులు 50 శాతం మౌళిక సదుపాయాలు,,భవన నిర్మాణాల పేరుతో కాంట్రాక్టర్ల జేబులు నింపేలా ఉన్నాయని విమర్శించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కొమురవెల్లి, మార్చి 19,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గురువన్నపేట గ్రామానికి చెందిన జిల్లా రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలను ఆదుకోవడానికి పలు సేవ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాజేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బుడిగే గురవయ్యాగౌడ్, మకిలి కనకయ్య, బుడిగే రమేష్‌గౌడ్, మకిల నవీన్, బుడిగే రమేష్, కిషన్,సతీష్, సాయికుమార్, చంద్రం, వెంకటేష్ ఉన్నారు.

## కాంగ్రెస్‌ది ప్రజా పాలన బడ్జెట్ : అత్తు

**సిద్దిపేట అర్బన్, మార్చి 19, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ ప్రజా పాలన బడ్జెట్‌గా ఉందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. సిద్దిపేటలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు.అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమంతో పాటు అన్ని వర్గాలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో అంకెల గారడి చూపించింది తప్ప పేదలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. కెసిఆర్ చేసిన అప్పులను చెల్లిస్తూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న సిఎం రేవంత్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు.రాష్ట్రంలో మరో 10 యేండ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

## పేదలకు సంజీవిని సిఎం సహాయనిధి : హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, మార్చి 19, ప్రభాతవార్త :** పేదలకు సంజీవినిలాంటిది సిఎం సహాయనిధి అని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన గద్దల బాబుకు రూ.60 వేలు, రాజశేఖర్‌కు రూ.35 వేల సిఎం సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు కార్పోరేట్ స్థాయి ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకోవడానికి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ సహకారంతో సకాలంలో సిఎం సహాయ నిధి చెక్కులు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కోహెడ, మార్చి 19, ప్రభాతవార్త :** మండల పరిదిలోని కూరెల్ల గ్రామంలో బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సురభి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, సురభి మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 250 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అపరేషన్ అవసరం ఉన్న వారిని ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా సురభి ఆసుపత్రి పిఆర్ఓ పరుశరాములు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, మాజీ ప్రజాప్రతినిధులు ,కాంగ్రెస్ నాయకుల వెంకటేశ్వర్‌రావు, గాజుల రమేష్, కుమారస్వామి, గాజుల వేంకటేశ్వర్లు, బండారి శ్రీశైలం, బండారి శ్రీనివాస్, కంటి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, మార్చి 19 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన మన్నె వెంకటయ్య మూడు రోజుల క్రితం అనారోగ్యం కారణంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల బిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు నావంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఆయనతో పాటు మర్కుక్ మాజీ సర్పంచ్ భాస్కర్, తాడెం గణేష్, కొట్టాల మహేష్ ఉన్నారు.

## ఏకాగ్రతతో పరీక్షలు రాయాలి : హెచ్ఎం

**మర్కుక్, మార్చి 19 (ప్రభాతవార్త):** పరీక్ష సమయంలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఏకాగ్రతతో పరీక్షలు బాగా రాయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, లయన్ సూర్యరాజులు సూచించారు. మండలకేంద్రం మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు బుధవారం లయన్ సూర్యరాజు చేతులమీదుగా హాల్ టికెట్లతో పాటు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలోని సరస్వతిదేవికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టంతో కాకుండా ఇష్టంతో పరీక్షలు బాగా రాసి ఉన్నత విద్యను కొనసాగించాలని, భవిష్యత్తులో మీకు నాతోడ్పాటును అందిస్తూ, మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు భవిష్యత్తు చదువుల అవసరాల కోసం నగదు బహుమతులను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు లయన్ రమణారావు, వందన, భూజాత, పద్మారెడ్డి, నరహరి, ప్రసాద్, నాగేశ్వరరావు, గణేష్, సిద్దయ్య, కృష్ణ, స్వామి, బుచ్చయ్య, ఫౌసియా, కవిత, శ్రీలత, మునీర్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**మర్కుక్, మార్చి 19 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన జుట్టు లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తాజా మాజీ ఎంపిపి పాండుగౌడ్ బుధవారం మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం మృతుని కుటుంబసభ్యులకు ఆర్థికసహాయం అందించారు. ఆయనతో పాటు బిఆర్ఎస్ గ్రామఅధ్యక్షుడు పిట్ల మహేష్, జుట్టు సుధాకర్, అంబదాస్‌గౌడ్, బోయిని మల్లేష్, మ్యాకల శ్రీనివాస్, అంజి, బాలస్వామి ఉన్నారు.

## విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించడమే లక్ష్యం : ప్రిన్సిపాల్

**హుస్నాబాద్ టౌన్, మార్చి 19,ప్రభాతవార్త :** విద్యార్థులలో క్రమశిక్షణ నేర్పించాలన్నదే పాఠశాల లక్ష్యం అని ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్ అన్నారు. బుధవారం కేరళా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 61 మంది విద్యార్థులు యూకేజీ పూర్తిచేయగా వారికి వారి తల్లితండ్రులతో కలసి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పున్న లావణ్యసది, పాఠశాల కరస్పాండెంట్ అల్లి శైలేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాల వల్లే ప్రభుత్వం పతనం

### బిజెపి జిల్లా అధ్యక్షుడు శంకర్


మాట్లాడుతున్న శంకర్

**హుస్నాబాద్ టౌన్, మార్చి 19,ప్రభాతవార్త :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లనే ప్రభుత్వం పతనమయ్యే రోజులు దగ్గర పడ్డాయని బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలో పార్టీ అసెంబ్లీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పార్టీ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయిందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న ప్రతీ సంక్షేమ పథకం కేంద్రం నిధులతోనే నడుస్తున్నాయని ఆరోపించారు. ఇక ప్రాంత శాసన సభ్యులు, మంత్రి పొన్నం ప్రభాకర్ విషయానికి వస్తే ఆయన కరీంనగర్ నుండి పారాషూట్ నాయకుడిగా వచ్చారని ఇక్కడి నుండి పార్టీని కథం చేసి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు.సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి,జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌రావు,అక్కిరెడ్డి తిరుమల,వేణుగోపాల్‌రావు, పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, సంపత్, మహేందర్‌రెడ్డి, రమేష్, సంతోష్, శ్రీకాంత్ ఉన్నారు.

## రేపు వార సంతకు బహిరంగ వేలం : మున్సిపల్ కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 19,ప్రభాతవార్త :** పట్టణంలో నిర్వహించే వారసంత/తైబజార్(మేకలు,గొర్రెలు,పశువుల)ల అంగడి నిర్వహణ 2025-26వ సంవత్సరానికి వచ్చే శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ ఒక ప్రటకనలో తెలిపారు.ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో వేలములో పాల్గొవాలనే ఆసక్తి గల వారు ధరావత్తు రూ 10 లక్షల రూపాయలను కమిషనర్ మున్సిపాలిటీ పేరున డిడి లేదా నగదుతో రూ 5వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వరకు అవకాశం ఉందన్నారు.

## హుస్నాబాద్ డిఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంకన్న

**హుస్నాబాద్ రూరల్, మార్చి 19,ప్రభాతవార్త :** హుస్నాబాద్ బస్ డిపో మేనేజర్‌గా బుధవారం ఎన్.వెంకన్న బాద్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డిఎంగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు బదిలీపై హైదరాబాద్ లోని కాచీగూడ డిపొకు వెళ్లడంతో హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ డిపోలో అసిస్టెంట్ మేనేజరుగా పని చేసిన వెంకన్న పదోన్నతిపై హుస్నాబాద్‌కు వచ్చారు.హుస్నాబాద్ డిఎంగా బాద్యతలు స్వీకరించిన వెంకన్నకు బదిలీపై వెల్లే డిఎం వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపి హుస్నాబాద్ బస్టాండ్, బస్‌డిపో, రూట్ మ్యాప్‌లను గురించి వివరించారు.అనంతరం డిపోలో ఇద్దరు మేనేజర్ల సమక్షంలో జనవరి నెలకు సంబందించిన ప్రగతి చక్ర అవార్డులను విధినిర్వహణలో బెస్ట్ ఈపికె, కెఎంపిఎల్,క్యాస్ తీసుకొచ్చిన ఉద్యోగులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


అవార్డులు అందిస్తున్న డిఎంలు

## ఉచితంగా ఛావా సినిమా ప్రదర్శన

షాద్‌నగర్, మార్చి 19, ప్రభాతవార్త:

షాద్‌నగర్‌పట్టణంలో బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యుడు అందె బాబయ్య ఆధ్వర్యంలో 'ఛావా' సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. పట్టణంలోని పరమేశ్వర థియేటర్‌లో ప్రదర్శించిన ఈసినిమాను వీక్షించేందుకు 700 మందిప్రేక్షకులు హాజరయ్యారు. అన్నివర్గాలప్రజలు ఈప్రత్యేక ప్రదర్శనను ఆస్వాదించడంతోపాటు సినిమాలోని సందేశాత్మక అంశాలను మెచ్చుకున్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంపట్ల బిజెపి నాయకుడు ప్రశాంత్‌ముదిరాజ్ బాబయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కోసం, సమాజహితంకోసం ఇటువంటికార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోకూడా బిజెపినాయకత్వం ఇలాంటి గొప్ప సేవాకార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈకార్యక్రమానికి ప్రజలనుంచి విశేషమైన ఆదరణలభించడంపట్ల పార్టీశ్రేణులు హర్షం వ్యక్తంచేశాయి.
19ఎస్‌డిఎన్‌ఆర్03: థియేటర్ వద్ద బిజేపీ నాయకులు, ప్రేక్షకులు

## వేసవిలో మామిడితోటలకు జాగ్రత్తలు తీసుకోవాలి

-జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ ఇంచార్జ్ అధికారి కమల



మామిడితోటను పరిశీలిస్తున్న ఉద్యాన,పట్టుపరిశ్రమ ఇంచార్జ్ కమల

పెద్దేముల్, మార్చి 19, ప్రభాతవార్త:

వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని మామిడితోటల యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్‌జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ ఇంచార్జ్ అధికారి కమల అన్నారు. బుధవారం పెద్దేముల్ తాండాకుచెందిన రాము నాయక్ మామిడితోటను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కమల మాట్లాడుతూ రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో మామిడితోటలకు డ్రిప్పుసహాయంతో ఒక్కోచెట్టుకు 6నుంచి 8డ్రిప్పర్లను ఉపయోగించి రోజుకు 3గంటలపాటు నీళ్ళను విడిచిపెట్టాలని అన్నారు. నీటి పారుదల ఉదయం ఒకగంటన్నర తిరిగి సాయంత్రం ఒకగంటన్నర చేసినట్లయితే మట్టిలో తేమశాతం నిలకడగా ఉండి చెట్టు వేసవిలో ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడుతుందని అన్నారు.

## గ్రామీణప్రాంత రోడ్లకు మహర్దశ

-కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్



బిటిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కొడంగల్, మార్చి19, ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి చొరవతో కొడంగల్ నియోజకవర్గంలోని గ్రామీణప్రాంత రోడ్లకు మహర్దశ మొదలైందని కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్ అన్నారు. బుధవారం మండలంలోనిపాతకొడంగల్‌గ్రామంనుంచి ఎక్కచెర్వు తండావరకు చేపట్టనున్న బిటిరోడ్డు నిర్మాణపనులకు భూమిపూజచేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కొడంగల్ నియోజకవర్గంలో అన్నిగ్రామీణప్రాంత రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయి. సిఎం రేవంత్‌రెడ్డి చొరవతో రానున్నరోజుల్లో అభివృద్ధిలో కొడంగల్‌రూపురేఖలుమారడం ఖాయమన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ మాజీకౌన్సిలర్ శంకర్‌నాయక్, మాజీసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్‌నాయకులు గొల్ల బుగ్గప్ప,పాండునాయక్,మోతిలాల్‌నాయక్, తార్యానాయక్,సుభాష్‌నాయక్,రాములు,సూరి,గొల్లరాములు,శివశంకర్,కె. శంకరయ్య, పంచాయతీరాజ్ ఏఈ రవికిరణ్‌లు పాల్గొన్నారు.

## ఓబిసి మహిళలకు సబ్‌కోటా కేటాయించాలి



అంబేద్కర్ కూడలివద్ద మద్దతు తెలుపుతున్న బిసి నాయకులు

తాండూరు టౌన్, మార్చి 19, ప్రభాతవార్త:

చట్టసభల్లో మహిళలకు కేటాయించిన 33 మహిళా రిజర్వేషన్లలో ఓబిసి మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని జాతీయ బిసిమహిళాసంఘం ఆధ్వర్యంలో ఈనెల 18,19న ఢిల్లీలో చేస్తున్న నిరసన మహిళాసెమినార్ కార్యక్రమానికి మద్దతుగా తాండూర్ డివిజన్ బిసి మహిళ అధ్యక్ష కార్యదర్శులు అనిత మంజుల ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలివద్ద సంఘీభావం కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో జాతీయ బిసి కార్యవర్గ సభ్యులు తాండూర్ నియోజకవర్గం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ రాష్ట్ర బిసి నాయకులు సయ్యద్‌సుకుర్,మహిళాసంఘంనాయకురాలు ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి జగదీశ్వరి, బషీరాబాద్‌మండల అధ్యక్షురాలు వీరమని యాలాల మండల బిసిసంఘం అధ్యక్షులు లక్ష్మణాచారి బిసి సోషల్ మీడియాఇంచార్జ్ బసవరాజ్,నాయిబ్రాహ్మణఅధ్యక్షులు పరమేష్, కుమ్మరి సంఘం అధ్యక్షులు పాండు, ఆరెకటిక యువనాయకులు సురేష్‌ముదిరాజ్ యువజనసంఘం నాయకులు రాముముదిరాజ్, బహుజన యువ నాయకులు శివకుమార్, జుంటుపల్లి వెంకట్, గిరిజాపురం రమేష్,, శ్రీధర్, యాసర్, బిసినాయకులు మంతటి రాజు, బాబాగౌడ్, మోచిరాజు అవేష్, రజక నరసింహ, శ్రీనివాస్, నవీన్, మహిళాసంఘం ప్రతినిధులు శోభ, జ్యోతి, నర్సమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు భూమి విరాసత్‌చేసి న్యాయంచేయాలి

-కెవిపిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పలి మల్కయ్య



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేస్తున్న రైతులు

పెద్దేముల్, మార్చి 19, ప్రభాతవార్త:

భూమి విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్న దళితులకు పట్టా విరాసత్ చేసి న్యాయంచేయాలని కెవిపిఎస్ జిల్లాప్రధానకార్యదర్శి ఉప్పలిమల్కయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పెద్దేముల్‌మండలం ఇందూరుగ్రామానికి చెందిన సాతంగారి నర్సమ్మ,సాతంగారి నర్సప్ప,సాతంగారి నౌజప్పలు సర్వేనెంబర్ 278లో సుమారు 8ఎకరాలభూమి విరాసత్‌కోసం సంవత్సరాలక్రితం దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు అమలుకానందున బుధవారం పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నర్సప్ప, నర్సమ్మ, లక్ష్మి, బందెప్ప పాల్గొన్నారు.

# భట్టి వారి మాట.. బంగారు బాట

-లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు ఉపముఖ్యమంత్రి 'సై'
-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషికి తగిన ఫలితం
-మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, గిరిజన కోఆర్డినేటర్ రఘునాయక్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్, మార్చి 19, ప్రభాతవార్త:

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రభుత్వం సత్వరం చేపడుతుందని, మూసీప్రాజెక్టుపరిధిలోని బునాది గానీ, కాలున పునరుద్ధరణపనులకు రూ. 266.65కోట్లతో పాలనాపరమైనఅనుమతినివ్వడం జరిగిందని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, గిరిజన కోఆర్డినేటర్ పి. రఘునాయక్ హర్షం వ్యక్తంచేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ విజ్ఞప్తి మేరకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అంగీకారాన్ని తెలిపారని వారు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు ఇవ్వాలన్నా, రైతులకు మేలుచేయాలన్నది కాంగ్రెస్ వల్లనే సాధ్యమని అన్నారు. గతప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుర్చీవేసుకొని ప్రాజెక్టు కడతానని రైతులను మోసంచేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈవిషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈరిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గ రైతులకు సాగునీటి ఇబ్బందులనుంచి శాశ్వతపరిష్కారం లభిస్తుందన్నారు. గత పదేళ్లలో కెసిఆర్ ప్రభుత్వం ఏనాడూ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టునిర్మాణంపై బడ్జెట్‌లో ఒక్కపైసా కేటాయించలేదని, కానీ నేడు రేవంత్‌ప్రభుత్వం తీసుకున్న మహత్తరమైన నిర్ణయం హర్షణీయమని అన్నారు. ఈబడ్జెట్‌లో నీటిపారుదలశాఖకు రూ.23,373కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పడం హర్షణీయమన్నారు. షాద్ నగర్ రాజకీయచరిత్రలోనే ఇదోసరికొత్తరికార్డు అని అన్నారు. గత ఎన్నికల్లో హామీ ఇవ్వడమే కాకుండా ఏడాదిన్నరపాలనలో పాలనాపరమైన అనుమతులు ప్రభుత్వం ఇవ్వడం శుభ సూచకమన్నారు.

## పదోతరగతి పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

రంగారెడ్డి అర్బన్, మార్చి 19, ప్రభాతవార్త:

రేపటి నుండి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లను చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుసీంద్రరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షాకేంద్రాల్లో అన్నివసతులు ఏర్పాటుచేయాలని, ఆరోగ్యశాఖ ప్రతిసెంటర్‌లో ఏఎన్‌ఎంలను అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలో 249 పరీక్షాకేంద్రాలలో 51,766మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నందున వారు ప్రత్యేకబస్సులను ఏర్పాటుచేసి సకాలంలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేవిధంగా బస్సులు నడిచేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్‌శాఖ తమపరిధిలోని సెంటరలలో విద్యుత్‌సరఫరా సక్రమంగా ఉండేవిధంగా చూడాలనితెలిపారు. జిల్లావిద్యాశాఖ పరీక్షలనిర్వహణలోఎలాంటి లోపాలురాకుండా ముందస్తు ఏర్పాట్లుచేసినట్లు అయనతెలియజేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు పలుసూచనలుచేశారు. పరీక్షలో జనరల్‌సబ్జెక్టులకు 24పేజీల బుక్‌లెట్, ఫిజికల్‌సైన్స్, బయాలజీసైన్స్ 12పేజీల బుక్‌లెట్ లలోనే సమాధానాలు రాయాలని తెలిపారు. పరీక్షనియమాలను ఉల్లంఘించినట్లయితే క్రమశిక్షణచర్యలు తీసుకుటామని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేకంగా కంట్రోల్‌రూం ఏర్పాటుచేసినట్లు ఆయనతెలిపారు. విద్యార్థుల సమస్యలకొరకు ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూంనెంబర్‌లు70322253057,96760166539అని తెలిపారు.

## బిఆర్ఎస్ జెండా దిమ్మె ధ్వంసం

-దిమ్మె ధ్వంసంపై బిఆర్ఎస్ నాయకుల ఆగ్రహం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

షాద్‌నగర్, మార్చి 19, ప్రభాతవార్త:

షాద్‌నగర్‌ప్రాంతంలో మొట్టమొదటిసారిగా రాజకీయసంస్కృతి చెడిపోతుందని, కొత్త సంస్కృతిని పరిచయంచేస్తూ ఇతరపార్టీల జెండాదిమ్మెలను ధ్వంసం చేయడం దురదృష్టకరమని బిఆర్ఎస్ పట్టణఅధ్యక్షుడు నటరాజ్, మాజీమున్సిపల్‌చైర్మన్ కొందూటి నరేందర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఫరూఖ్‌నగర్‌లోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహంవద్ద బిఆర్ఎస్ జెండాదిమ్మెను ధ్వంసంచేయడం పట్ల వారు స్థానికపోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా నటరాజన్ మీడియాతో మాట్లాడుతూ ఇతరపార్టీల జెండాలను ధ్వంసం చేయడం మంచిపద్ధతికాదని హితవుపలికారు. ఎన్నికలసమయంలోనే రాజకీయాలు ఉంటాయని, అతర్వాత అందరు కలిసికట్టుగా ఉంటారని, కానీ ఇలా పార్టీజెండాదిమ్మెలను ధ్వంసంచేయడం మొట్టమొదటిసారి అని అన్నారు. ఇలాంటిసంస్కృతి మునుపెన్నడూ లేదని, కొత్తగా పరిచయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పోలీసులు దీనిపై సమగ్రవిచారణ జరిపి చర్యలుతీసుకోవాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు. సమీపంలోని దర్గా వద్ద సిసికెమెరాలు ఉన్నాయని, వాటిలో ఈపని ఎవరుచేశారో తెలుస్తుందని, దాన్ని కూలంకషంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నటరాజన్ డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ మన్నె కవిత నారాయణ, మండలపార్టీ అధ్యక్షుడు లక్ష్మణనాయక్, మాజీ కౌన్సిలర్లు బచ్చలి నరసింహ్మ, కానుగు అనంతయ్య, యుగంధర్, పిల్లి శేఖర్, చింటు, నాయకులు జూపల్లి శంకర్, నంద కిశోర్, చిన్న యాదగిరి, చెట్ల జంగయ్య, నందిగామ శ్రీనివాస్, గుండు అశోక్, కొండ మల్లేష్, చెర్క శివ, మంగ శ్రీశైలం, వెంకటేష్‌గుప్తా, సుశాంత్, రాజు, మహమూద్, నరేందర్, ఉమాపతి, తేజ యాదవ్, పవన్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్‌గా ధారాసింగ్

పెద్దేముల్, మార్చి 19, ప్రభాతవార్త:

నారాయన్‌పేట్, మక్తల్ నియోజకవర్గాల కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధి కార్యక్రమాల ఇంచార్జ్‌గా కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి, మాజీ జడ్‌పిటిసి ధారాసింగ్‌కు బాధ్యతలు అప్పగించారు. బుధవారం హైద్రాబాద్ గాంధీ భవన్‌లో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులకు నిర్వహించిన పమావేశంలో నారాయన్‌పేట్, మక్తల్ నియోజకవర్గాల ఇంచార్జ్‌గా ధారాసింగ్‌కు పిసిసి అధ్యక్షులు పార్టీ బాధ్యతలు అప్పగించారు.

## ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్




ముందస్తుగా ఆశావర్కర్లను అరెస్ట్ చేసిన పోలీసులు

నవాబుపేట, మార్చి 19, ప్రభాతవార్త:

మండలంలోని ఆయాగ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్లు తమ డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ నిరసనకార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పలువురు ఆశావర్కర్లను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్‌చేశారు. కనీసవేతనం నెలకు18000రూపాయలకు ప్రభుత్వం పెంచాలని వారు డిమాండ్‌చేస్తూ నిరసనలకు ఉపక్రమిస్తున్నందుకు ముందస్తు అరెస్ట్‌చేసి స్వంతపూచికత్తుపై విడుదలచేశారు. ఈకార్యక్రమంలో ఆయాగ్రామాల ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## కొనుగోలు వ్యాపారులు అనుమతులు పొందాలి

-మార్కెట్‌కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు



వ్యాపారస్థులతో మాట్లాడుతున్న మార్కెట్‌కమిటీ చైర్మన్ ఆంజనేయులు

చౌడపూర్, మార్చి 19, ప్రభాతవార్త:

చౌడపూర్ మండలపరిధిలోని చౌడపూర్, మరికల్ గ్రామాలలో ధాన్యం కొనుగోలుకేంద్రాలను బుధవారం ఉమ్మడిమార్కెట్‌కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు సందర్శించారు. ధాన్యం కొనుగోలుచేసినా, విక్రయించినా తప్పనిసరిగా అనుమతులు పొందాలని,వ్యాపారస్థులు ప్రతి ఒక్కరూ లైసెన్సులుకలిగి ఉండాలని బిఎస్ ఆంజనేయులు సూచించారు. పలువురు వ్యాపారస్థులకు నోటీసులు జారీచేసి, అనుమతులు పొందనిచో చర్యలు తీసుకుంటామని ఆంజనేయులు ముదిరాజ్ తెలిపారు. మార్కెట్ సూపర్వైజర్స్ రాములు, సిద్ధయ్య, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

## రాష్ట్రప్రభుత్వ సాహసోపేత నిర్ణయాలు చారిత్రాత్మకం

-టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు, మార్చి 19, ప్రభాతవార్త:

సామాజిక న్యాయంకోసం రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలు చారిత్రాత్మకమని టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎన్నికలముందు ప్రజలకు ఇచ్చినమాటప్రకారం కులగణనచేపట్టి బిసిల రిజర్వేషన్ల పెంపు, ఎస్సీవర్గీకరణబిల్లును అసెంబ్లీలో ఆమోదింప చేయడం అందుకు నిదర్శనమని ఆయన ఉదహరించారు. మండలపార్టీ అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్ ఆధ్వర్యంలో పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీసిఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోచేపట్టిన కులగణనకు విపక్షాలు విఘాతాలు కలిగించినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిప్రభుత్వం వెనుకడుగువేయకుండా సమర్థవంతంగా కులగణనను పూర్తిచేసి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చినమాటను నిలబెట్టుకొందని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు దావా దానంజయ, యూత్‌కాంగ్రెస్ రాష్ట్రప్రధానకార్యదర్శి రవికాంత్‌గౌడ్, తాలూకా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దళపతిగౌడ్, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీకాంత్, మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, ఐఎన్‌టీయూసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, మాజీ సర్పంచ్ పర్వతాలు, ఖలీల్, ఖాదర్, ఫరీద్,కాలె మల్లయ్య, మైసయ్య, వెంకట్‌రెడ్డి, రాఘవేందర్, అలీం, శంకర్, మహేష్, విజయ్ శంకర్, కుమార్ తదితరులు ఉన్నారు.

# సామాన్య ప్రజలకు అందుబాటులో శాండ్ బజార్లు

ప్రతి 30కిలోమీటర్లకు ఒక సాండ్ బజార్ ఏర్పాటు
తెలంగాణరాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ ఏరావతారి



సాండ్‌బజారును ప్రారంభిస్తున్న తెలంగాణరాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ ఏరావతారి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి
హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:

సామాన్యప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నగరం చుట్టూ ప్రతి 30కిలోమీటర్లకు ఒక సాండ్ బజారును ఏర్పాటుచేస్తున్నట్లు తెలంగాణరాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్ ఏరావతారి తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ ఏరావతారి, రాష్ట్ర గనుల భూగర్భశాఖ ప్రిన్సిపాల్‌సెక్రెటరీ శ్రీధర్, డైరెక్టర్ శశాంకలతో కలిసి రాజేందర్‌నగర్ నియోజవకర్గం వట్టినాగులపల్లిలో సాండ్‌బజార్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ... దళారులు వారి ఇష్టానుసారంగా రేట్లు పెంచుతూ మోసాలకు పాల్పడుతున్నారని దీనిని గమనించిన ప్రభుత్వం సన్న ఇసుకకు రూ.1800లకు అదేవిధంగా దొడ్డు ఇసుకకు రూ. 1600లకు చొప్పున ఆన్‌లైన్‌లో బుక్ చేసినట్లయితే వారికి ఇసుకపంపడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడినుండి తీసుకెళ్ళే ఇసుకకు రవాణాచార్జీ అదనంగా ఉంటుందని తెలియజేశారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ మాట్లాడుతూ... గృహనిర్మాణాలు చేసుకునే ప్రజలకు అతితక్కువధరలకు అందుబాటులోతేవాలనేఉద్దేశంతో ప్రభుత్వం ముందుకువచ్చి ఈధరలను నిర్ణయించిందని ఆయన అన్నారు. ఇష్టానుసారంగా రేట్లుపెంచుతూ ప్రజలకు ఇసుకను అందుబాటులో లేకుండా ఎక్కువధరకు అమ్మడాన్ని అరికట్టుటకు ప్రభుత్వం ధరనిర్ణయించిందని అన్నారు. 1జిఎండిసి ద్వారా హైదరాబాద్ నగరానికి మూడుప్రాంతాల్లో సాండ్‌బజార్లను ఏర్పాటుచేయడంతోపాటు నగరంచుట్టూ ప్రతి 30 కిలోమీటర్లకు ఒకసాండ్‌బజారును ఏర్పాటుచేస్తామనిఅన్నారు. ఈ ప్రక్రియద్వారా దళారివ్యవస్థ ఉండదని సరసమైన ధరలకే ప్రజలకు ఇసుకలభిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రగనుల,భూగర్భశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ, ఇసుక అనేది ఈరోజుల్లో నిత్యావసరవస్తువులాగా నగరంలో ఎక్కువగా ఉపయోగంలో ఉన్నందున,నగరంచుట్టుప్రక్కల సాండ్‌బజారునుఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన ఇసుకను తక్కువధరలకే ఇచ్చేందుకు ఈసాండ్‌బజార్లను నెలకొల్పడం జరిగినదని తెలిపారు. కార్యక్రమంలో టిజిఎండిసి ఎండి. సుశీల్‌కుమార్, ఏడిమైన్స్ నర్సింహారెడ్డి, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, బిల్డర్లు, స్థానిక ప్రజాప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక, ఉద్యోగులకు ఊరటనివ్వని రాష్ట్ర బడ్జెట్

-సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు

షాద్‌నగర్, మార్చి 19, ప్రభాతవార్త:

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు,ఉద్యోగులవేతనాలు, సంక్షేమంగురించి ఎటువంటిప్రస్తావన లేకపోవడాన్ని సిఐటియు వ్యతిరేకిస్తుందని సిఐటియు జిల్లాఅధ్యక్షుడుఎన్.రాజు అన్నారు.బడ్జెట్‌లో కార్మికశాఖకు రూ.900కోట్లు నామమాత్రంగా కేటాయించారని, ఒక కోటియాభైలక్షలమంది ఉన్న కార్మికులకు ఈకేటాయింపులు ఏమాత్రంసరిపోవని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలో కార్మికులసంక్షేమం గురించి చెప్పిన అంశాలు ఈబడ్జెట్‌లో లేవని, బీడీ కార్మికులకుచేయూత,జీవితబీమా, ఈఎస్ఐ అసంఘటితరంగకార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు, ఆటో,క్యాబ్‌డ్రైవర్లు,స్విగ్గి,జొమాటో కార్మికులకు సామాజికభద్రత కల్పిస్తూ రాజస్థాన్‌తరహా చట్టాన్నితెస్తామని మేనిఫెస్టోలో చేర్చినవిషయం మర్చిపోయారని, అదేవిధంగా చిరువ్యాపారులు, ఫుట్‌పాత్‌వ్యాపారులకు వడ్డీలేని రుణసదుపాయం కల్పిస్తామన్న వాగ్దానాన్ని గాలికివదిలేశారని, మిషన్‌భగీరథ కార్మికులకు కనీసవేతనాలు, గ్రామపంచాయతీ కార్మికులు, మధ్యాహ్నభోజన కార్మికుల బకాయివేతనాల చెల్లింపుకు ఎలాంటిచర్యలు ఈబడ్జెట్‌లో తీసుకోలేదని పేర్కొన్నారు. ఉద్యోగవర్గాన్ని, అసంఘటిత కార్మికులను, స్కీం వర్కర్లను, పారిశ్రామిక కార్మికులను, మొత్తంగా రాష్ట్రకార్మికవర్గాన్ని ఈబడ్జెట్ నిరుత్సాహపరిచిందని రాజు పేర్కొన్నారు.

## పదవతరగతిలో ఉత్తమప్రతిభ కనబరచాలి

-గిరిజన విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్

కుల్కచర్ల, మార్చి 19, ప్రభాతవార్త:

పదోతరగతి పరీక్షల్లో విద్యార్థి నులు ఉత్తమప్రతిభ కనబరచాలని గిరిజన విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికలపాఠశాల కళాశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి శ్రద్ధతో ఏకాగ్రతతో చదవాలని పదవతరగతిలో మంచిమార్కులు తెచ్చుకోవాలని అందరూ 100శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కుల్కచర్ల మండలం విద్యాధికారి హబీబ్ అహ్మద్, కస్తూర్బా విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ దేవీకిషన్‌నాయక్, గిరిజన విద్యార్థిసంఘం కుల్కచర్ల మండలప్రధానకార్యదర్శి గణేష్ నాయక్, పాఠశాలసిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పరీక్ష బందోబస్తు

-పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ధారూరు, మార్చి 19, ప్రభాతవార్త:

రేపటినుంచి పదోతరగతిపరీక్షలు ప్రారంభమవుతాయని, అందుకుతగిన ఏర్పాట్లుచేశామని మండలవిద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా 8జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లన ంచి అలాగే కేజీబీవీ ధారూర్ నుంచి 293విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని, అందులో అబ్బాయిలు130, అమ్మాయిలు 163మంది ఉన్నారని తెలిపారు. ఇందుకోసం మండలంలోని ధారూర్, కేరెల్లి రెండు సెంటర్లు ఏర్పాటుచేశామని చెప్పారు. పరీక్షలు ఉదయం 9.30 నిమిషాలనుంచి 12.45 నిమిషాలవరకు జరుగనున్నాయి. పరీక్షాకేంద్రానికి హాజరయ్యే విద్యార్థి హాల్‌టికెట్, రైటింగ్‌ప్యాడ్, పెన్నులు, పెన్సిల్ వంటి రాతసామగ్రి తప్ప మిగిలిన ఎలాంటి ఎలక్ట్రానిక్‌వస్తువులు,ప్రింటెడ్‌పుస్తకాలు ఎట్లాంటివి అనుమతించబడవని సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని చెప్పారు.

**-పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్: ఎస్సై అనిత**

పదవతరగతి పరీక్షాకేంద్రాలవద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ అనిత తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పదవతరగతి పరీక్షల ు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పరీక్షాకేంద్రం ఆవరణంలో 144సెక్షన్ అమలుచేస్తున్నందున 100మీటర్ల లోపు ఇతరులు ఎవరూ ఉండరాదని హెచ్చరించారు. నలుగురు కంటే ఎక్కువమంది గుమికూడరాదని అన్నారు. పరీక్ష సమయంలో ఎవరైనా అనవసర చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకొంటామని పరీక్షా కేంద్రాల సమీపంలోని బుక్‌స్టాల్స్, జిరాక్స్ సెంటర్లు ఓపెన్ చేయొద్దని సూచించారు. పకిడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తామని తెలిపారు.

## నూతన గ్రామకమిటీలు ఎన్నిక

ధారూరు,మార్చి 19, ప్రభాతవార్త:

మండలపరిధిలోని మోమిన్‌కలాన్, మోమిన్‌కుర్ద్ గ్రామాలలో మండల పార్టీ అధ్యక్షులు మాన్సింగ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామకమిటీలు ఎన్నుకున్నారు. మోమిన్‌కలాన్ గ్రామకమిటీఅధ్యక్షుడిగా ఆలంపల్లి రవి,ఉపాధ్యక్షుడిగాషఫీ,మోమిన్‌కుర్దు గ్రామకమిటీ అధ్యక్షుడిగా పామిని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా జీవన్, సెక్రటరీగా కె.వీరేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అశోక్‌ముదిరాజ్, మాజీ జెడ్పీటీసి రాములు, రమేష్, కృష్ణ, గఫార్, ఆలంపల్లి బాలకృష్ణ, సిద్దలూరు యాదగిరి, కొండయ్య, అవినాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో ప్రజారంజక బడ్జెట్

-పిసిసి ప్రధానకార్యదర్శి పట్లోళ్ల రఘువీర్‌రెడ్డి

ధారూరు, మార్చి 19, ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఆర్థికమంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణప్రజల సంక్షేమమేధ్యేయంగా ప్రజాపాలనలో ప్రజారంజక బడ్జెట్ ప్రవేశపెట్టారని పిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చిందనీ, సంక్షేమాన్ని అభివృద్ధిని ఎక్కడ మరువకుండా అన్నిశాఖలకు బడ్జెట్ కేటాయించిందని అన్నారు. ఆరుగ్యారెంటీల అమలుకు కృషిచేస్తూ బడ్జెట్ కేటాయించిందని అన్నారు. నిరుద్యోగుల కోసం 25,190ఉద్యోగాలభర్తీకి అంగన్వాడీలలో 15,236 అలాగే రెవె న్యూ డిపార్ట్మెంట్లో 10954 గ్రామస్థాయి పోస్టుల ుభర్తీ చేయ న్నారు. ఎస్సీ వర్గీకరణ, బిసిరిజర్వేషన్లతో తెలంగాణా దేశదృష్టిని ఆకర్షించిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకెళ్తుందని, రాష్ట్ర అభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వానికి రఘువీర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## నీరు లేక ఎండుతున్న వరి పొలం



వరి పంట పరిశీలిస్తున్న ఏఈఓ సంజీవ్ రాథోడ్

ధారూరు,మార్చి 19, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గురుదొట్ల రైతువేదిక క్లస్టర్‌పరిధిలోని నీళ్లులేక సుమారు 25ఎకరాలవరకు వరిపొలం ఎండుముఖం పట్టిందని ఏఈఓ సంజీవ్ రాథోడ్ తెలిపారు. బుధవారం రైతుల పండించిన వరి పొలాల ు ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు ఎకరాకు రూ.25వేల చొప్పున పెట్టుబడిగా పెట్టామని, అందుకు ప్రభుత్వం పట్టించుకొని తమను ఆదుకునేలా చర్యలుచేపట్టాలని రైతులు ఏఈఓను కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామని ఆయన తెలిపారు.

## గోకఫస్లావాద్‌ను నూతనమండలంగా ఏర్పాటుచేయాలి

దౌల్తాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:

వికారాబాద్‌జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లావాద్‌గ్రామాన్ని నూతనమండలంగా ఏర్పాటుచేయాలని సంబంధిత గ్రామప్రజలు కోరుతున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో కొత్త మండలాల ఏర్పాటుతోపాటు రెవెన్యూ డివిజన్ కూడా ఏర్పాటు చేస్తారని వార్తవిన్న గిరిజనబిడ్డలు, చుట్టుపక్కల గ్రామప్రజలు గోకాఫస్లావాద్ కూడా మండలం అవుతుందనే ఆశ చిగురించిందని, సంబంధితగ్రామాల తీర్మానాలతో అన్నిగ్రామాలవాసులు కలిసి గతంలో పాదయాత్రలు, ధర్నాలుచేసి సంబంధితప్రజాప్రతిధులకు,అధికారులకు, అర్జీలుసమర్పించుకోవడం జరిగిందని, అధికారులు గోకాఫస్లావాద్ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేస్తామన్నారని అన్నారు.